అవినీతి ఆటల పోటీలో జిల్లా క్రీడాభివృద్ధిశాఖ విజేతగా నిలిచింది. రెండేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం హయాంలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీల నిర్వహణలో జిల్లాలో భారీ అవినీతి వెలుగులోకి వచ్చింది. క్రీడాకారుల పేరుతో ఏకంగా క్రీడాభివృద్ధి అధికారే చేతి వాటానికి పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వాల్సి ఉండగా, మొదటి స్థానం గెలుపులన్నీ తన పేరుతో రాసేసుకుని భారీగా బొక్కేసినట్లు తెలిసింది. అధికారితోపాటు వారి కుటుంబ సభ్యుల పేర్లను కూడా చేర్చి వారు క్రీడల్లో పాల్గొని, విజేతలుగా నిలిచినట్లు నగదు కాజేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పోటీల నిర్వహణ పేరుతో రెండు నెలలపాటు జరిగిన వ్యవహారంలో భారీగానే స్వాహా సమాచారం. మొత్తంగా ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన క్రీడాభివృద్ధి శాఖ అధికారిణి వారి భవిష్యత్‌తో ఆటలాడారు.



ఆట నోటు నాదే

- పోటీల నిర్వహణలో క్రీడాధికారిణి చేతివాటం
- 'ఆడుదాం ఆంధ్ర'లో ఇష్టారీతిన దోపిడీ
- విజేతల ప్రైజ్‌మనీ డీఎస్‌డీవో ఖాతాలోకి..
- నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్‌లు
- క్రీడాకారులు, విజేతల్లో అధికారిణి కుటుంబం

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 'ఆడుదాం ఆంధ్ర'లో అవినీతి ఆటలను ప్రోత్సహించింది. వీటిలో జరిగిన అక్రమాలపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించింది. క్రీడా పోటీల నిబంధనల ప్రకారం గ్రామ, వార్డు, మండల, జిల్లా స్థాయిలో రెండు నెలలపాటు పోటీలు నిర్వహించి, వారిలో ప్రతిభ చాటిన వారిని జిల్లా పోటీలకు ఎంపిక చేయాల్సి ఉంది. ఒక్కో క్రీడాకారుడు లేదా క్రీడాకారిణి రెండు ఆటల్లో మాత్రమే పాల్గొనాల్సి ఉంది. కానీ ఇక్కడ మాత్రం డీఎస్‌డీవో కుటుంబ సభ్యులు అన్ని నియోజకవర్గాలలో పాల్గొన్నట్లు ఆధారాలు ఉన్నాయి. కనీసం ఏ ఆటలతోనూ సంబంధం లేని వారి కుటుంబ సభ్యులు క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచినట్లు, వారికి ప్రైజ్‌మనీ అందించినట్లు బ్యాంకు ఖాతా ఆధారాలు చెబుతున్నాయి. ప్రత్యేకించి జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి కూడా పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతి సాధించినట్లుగా రికార్డులో నమోదు కావడంతో భారీగా బహుమతి సొమ్ము కాజేయడం విస్మయం కలిగిస్తోంది.

నిర్వహణకు కేటాయించిన నిధులివీ

పోటీల నిర్వహణలో అడ్మినిస్ట్రేషన్ ఖర్చులు రూ.1.5 లక్షలు, పర్యవేక్షణకు రూ.14లక్షలు కేటాయించారు. ఇతర ఖర్చులు రూ. 50వేలు, నియోజకవర్గం, జిల్లాస్థాయి విజేతల నగదు బహుమతుల కోసం రూ.50లక్షల 10వేలు కేటాయించారు. ఆహారం, రవాణా, రూ.27,08,250 కేటాయించారు. పోటీల్లో విజేతలైన వారికి ఐదు క్రీడలకు సంబంధించి 8 నియోజకవర్గాలకు రూ.40లక్షల 80 వేలు చొప్పున జిల్లాస్థాయిలో 93లక్షల 18వేల 250 కేటాయించారు. అయితే వాటిలో సగానికి పైగా నిధులు దుర్వినియోగం అయినట్లు సమాచారం.

రూ.93 లక్షలకు లెక్కలేవీ?

రెండు నెలలపాటు నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' పోటీల నిర్వహణకు నాడు వైసీపీ రూ.93లక్షల 18వేల 250 కేటాయించారు. 2023 డిసెంబరు 26వ తేదీ నుంచి 2024 ఫిబ్రవరి 15వ తేదీ వరకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, ఆటల పోటీలను గ్రామ, సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించేలా చర్యలు చేపట్టింది. అందుకోసం జిల్లాలో 550 క్రీడా మైదానాలను అధికారులు ఎంపిక చేశారు. రెండు లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపే క్రీడాజట్లకు 28వేల కిట్‌లు కేటాయించారు. ఒకవైపు ఆటలాడేందుకు ఆసక్తి చూపేవారే కరువైన క్రమంలో వేల సంఖ్యలో జిల్లాకు చేరిన క్రీడా సామగ్రి కూడా పక్కదారిపట్టినట్లు సమాచారం. ముఖ్యంగా పోటీల నిర్వహణ సమయంలో నాటి ప్రభుత్వం రూ.93లక్షలు 18వేల 250 కేటాయించగా, ఇక్కడి జిల్లా క్రీడాభివృద్ధి అధికారులు దాతల నుంచి సహకారం కూడా పొందినట్లు సమాచారం. మరోవైపు పోటీలలో విజేతలైనవారికి కనీసం సర్టిఫికెట్‌లు కూడా ఇవ్వకపోవడం దారుణం.

వైసీపీ నేతల అండతో అధికారిగా చెలామణి

గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ పెద్దల ఆశీస్సులతో జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా నియామకం అయినట్లు సమాచారం. ఆ అధికారి క్రీడాభివృద్ధి కోసం పనిచేయకుండా నాటి వైసీపీ పెద్దల మెప్పుకోసం పనిచేస్తూ 'ఆడుదాం ఆంధ్ర'లో భారీగా దోచినట్లు సమాచారం. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక నేటికీ అదే పంథా కొనసాగిస్తూ క్రీడలను నిర్వీర్యం చేయడంపై క్రీడా సంఘాలు, క్రీడాకారుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ఆ అధికారిపై చర్యలు తీసుకుని, అవినీతి నిగ్గుతేల్చాలని వారు కోరుతున్నారు.

బిల్లులు వస్తున్నాయ్

- ఉపాధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఊరట
- వారం రోజుల్లో రూ.40 కోట్లకుపైగా జమ
- గత ప్రభుత్వం నిలిపివేసిన బిల్లులకూ తాజాగా లైన్ క్లియర్

జిల్లాలో ఉపాధి పనుల కాంట్రాక్టు చేసిన వారికి భారీ ఊరట లభించింది. దాదాపు తొమ్మిది మాసాలకుపైగా ఆ పనులు చేసినవారు బిల్లుల కోసం ఎదురుచూస్తుండగా గతవారం రోజులుగా నగదు జమ అవుతున్నాయి. అలా జిల్లాలో సుమారు రూ.40 కోట్లకుపైగానే బిల్లులు చెల్లింపులు జరిగాయి. అదే సమయంలో గత టీడీపీ ప్రభుత్వం(2014-19)లో పనిచేసిన వాటికి, అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిలిపివేసిన పెండింగ్ బిల్లులకూ మోక్షం లభించింది. వాటిని కూడా జమ చేసేందుకు కేంద్రం అనుమతిచ్చింది. అందుకోసం ఒక్కొక్క పనిచేసిన కాంట్రాక్టర్ వివరాలను సంబంధిత సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

ఒంగోలు, జూలై 13(ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా ఏడాది కాలంలో ఉపాధి పథకం మెటీరియల్ కోటా కింద భారీగా పనులు జరిగాయి. వివిధ రకాల పనులకు కలిసి మొత్తం రూ.183 కోట్లు మేర పనులు మంజూరు చేశారు. అందులో రూ.150 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. తొలుత పనులు చేపట్టిన ప్రారంభంలో ప్రతివారం పనులకు బిల్లులు చెల్లింపులు జరిగాయి. గత ఏడాది అక్టోబరు తొలిపక్షం వరకు సుమారు రూ.35 కోట్లు బిల్లులు చెల్లింపు జరిగి ఆగిపోయాయి. సకాలంలో కేంద్రం నిధులు ఇవ్వక, ఇచ్చిన వాటికి రాష్ట్ర ప్రభుత్వం తన వాటా జమ చేయక చెల్లింపులు నిలిచిపోయాయి. అలా దాదాపు తొమ్మిది నెలల పాటు బిల్లులు నిలిచిపోవడంతో పనులు చేసిన కాంట్రాక్టర్లంతా గగ్గోలు పెడుతున్నారు.

గత ప్రభుత్వంలో ఆగిపోయిన బిల్లులు

టీడీపీ అధికారం(2014-19)లో ఉన్నప్పుడు చివరి ఏడాది చేసిన పనులకు దాదాపు రూ.60 కోట్లకుపైగా పెండింగ్ ఉండగా అనంతరం వచ్చిన వైసీపీ వాటిని ఇవ్వకుండా ఆపేసింది. కొందరు పనిచేసినవారు కోర్టును ఆశ్రయించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రూ.10 కోట్ల వరకు బిల్లులు చెల్లించిన నాటి వైసీపీ ప్రభుత్వం అనంతరం ఆ బిల్లులు అప్‌లోడ్ కూడా చేసే ప్రక్రియను నిలిపివేసింది. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌లో బిల్లుల నమోదు చేసే అవకాశం లేకుండా వర్క్ క్లోజర్(పనిక్లోజ్‌గా)గా చూపింది. అప్పటికే కోర్టు ఆదేశాలతో చెల్లించిన పది కోట్ల రూపాయాలతో పాటు మరో రూ.11 కోట్ల వరకు బిల్లులు అప్‌లోడ్ అయి ఉండగా ఇంచుమించు రూ.40 కోట్ల విలువైన సుమారు 1400 పనుల వివరాలు వర్క్ క్లోజర్‌లో పడిపోయాయి.

ప్రజా ప్రభుత్వంలో బిల్లులపై దృష్టి

ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక కొత్తగా మెటీరియల్ పనులు చేపట్టడంతో పాటు వైసీపీ హయాంలో నిలిపివేసిన బిల్లులపై కూడా దృష్టి సారించింది. నిలిపివేసిన రూ.11 కోట్లు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు వివరాలు, ఆధారాలు ఉండగా మిగిలిన రూ.40 కోట్లకుపైగా 1400 పనుల వివరాలు సాఫ్ట్‌వేర్‌లో లేవు. ఆ పనుల బిల్లుల నమోదుకు అవకాశంలేకుండా పోయింది. వీటిపై ప్రభుత్వం భారీ కసరత్తు చేసింది. ఆగిన బిల్లుల కోసం కేంద్రంతో సంప్రదించింది. నాలుగు రోజుల క్రితం వాటిని నమోదు చేసేందుకు కేంద్రం అనుమతి ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో గత ప్రభుత్వంలో ఆగిపోయిన రూ.40 కోట్ల బిల్లులకు కూడా మోక్షం లభించింది. ఈనెలాఖరులోపు వాటి చెల్లింపులకు వీలుకలగనున్నట్లు అధికార వర్గాల సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఇక గత ఏడాది చేసిన పనుల పెండింగ్ బిల్లులు రూ.110 కోట్లు గతంలో చేసి పెండింగ్ ఉన్న రూ.11 కోట్లు వెరశి రూ.121 కోట్లు పెండింగ్ బిల్లులలో గతనెలాఖరులో రూ.65కోట్లు బిల్లులు ఆప్‌లోడ్‌కు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో వాటిని అధికారులు నమోదు చేశారు. అందులో దాదాపు రూ.40 కోట్ల వరకు వారం రోజులుగా నగదు జమ అవుతున్నాయి. రానున్న వారం రోజుల్లో మరో రూ.25 కోట్ల వరకు జమ కానున్నాయి. గత ఏడాది పనులకు సంబంధించి మరో రూ.50 కోట్లు చెల్లింపులు జరగాల్సి ఉంది.



సన్మానం పొందిన నూతన సభ్యులు వీరే

పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా

హజరత్తయ్య

వివరాలు మెయిన్‌లో

- ఉపాధ్యక్షుడిగా తిరుపతిస్వామి
- ఇద్దరూ జిల్లాకు చెందినవారే

పంటకు బీమా.. రైతుకు ధీమా

- పత్తికి 15వతేదీ, మిగిలినవాటికి 31 వరకు గడువు

7

గేదెను తప్పించబోయి ఇద్దరు దుర్మరణం

బైకును ఢీకొన్న కారు



ప్రమాదంలో మృతిచెందిన దావీదు



ప్రమాదంలో మృతిచెందిన ఆకవీటి విజయ్

మార్కాపురం రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందిన ఘటన మండలంలోని జాతీయ రహదారిపై తిప్పాయపాలెం, జంగంగుంట్ల మధ్య ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో చోటుచేసుకుంది. గేదెను తప్పించబోయి కంభం నుంచి మార్కాపురం వైపు వస్తున్న కారు బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఆకవీటి విజయ్ (25), బెజవాడ దావీదు (43) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో గేదె కూడా మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకవీటి విజయ్‌ది అర్థవీడు మండలం రంగాపురం గ్రామం. అతను అవివాహితుడు. బెజవాడ దావీదుది బొల్లుపల్లి గ్రామం. ఈయనకు వివాహమైంది. భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతులిద్దరూ ఎర్రగొండపాలెం మండలం కొలుకులలో బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు హాజరై తిరిగి స్వగ్రామం వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

గ్రానైట్ క్వారీల్లో భద్రత డొల్ల

జిల్లాలోని గ్రానైట్ క్వారీల్లో భద్రత డొల్లగా కనిపిస్తోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక మంది కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. కాలంచెల్లిన డంపర్ల వినియోగం, బెంచ్ కటింగ్ సక్రమంగా లేకపోవడం కారణంగా పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారుతున్నట్టు తెలుస్తోంది.

- కాలం చెల్లిన డంపర్‌ల వినియోగం
- కొనసాగుతున్న విజిలెన్స్ తనిఖీలు
- మైనింగ్ శాఖను రికార్డులు కోరిన వైనం

ఒంగోలు క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి, బూదవాడ, ఆర్‌ఎల్‌పురం ప్రాంతాల్లో సుమారుగా 2 వేల ఎకరాల్లో గ్రానైట్ విస్తరించి ఉంది. దీన్ని వెలికితీసేందుకు 128 లీజులు ఉన్నాయి. 35 సంస్థలు క్వారీయింగ్ చేస్తున్నారు. క్వారీల్లో భద్రతా లోపంతో పాటుగా ఇష్టానుసారంగా వాగులు, వంకలు స్వాధీనం చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ క్వారీ యజమానులు జేబులు నింపుకుంటున్నారు. అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతోంది. గత నెల 18న సూర్య గ్రానైట్ క్వారీలో డంపర్ బోల్తాపడి ఇద్దరు మృతి చెందిన సందర్భంలోనూ భద్రతా లోపాలే కారణమని తెలిసింది. కాలం చెల్లిన డంపర్లు వాడటం, క్వారీల్లో బెంచ్‌లు సక్రమంగా లేకపోవడం లాంటి కారణాలతోనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.



రంగంలోకి విజిలెన్స్

విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. నెల రోజులుగా క్వారీల్లో ఉన్న అనుమతులపైనా, హద్దులలోనే క్వారీయింగ్ చేస్తున్నారా? భద్రత ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలపై విచారణ చేపట్టారు. ఇప్పటికే 20 క్వారీల్లో తనిఖీలు నిర్వహించారు. అనుమతులు, హద్దులు గురించి పరిశీలన చేయాలంటే రికార్డులు, మ్యాప్‌లు అవసరం. వీటి కోసం మైనింగ్ శాఖ అనుమతి తీసుకోవాలి. ఈ మేరకు మైనింగ్ అధికారులకు విజిలెన్స్ నుంచి లేఖ రాశారు.

● బెంచ్ కటింగ్‌లు సక్రమంగా లేని క్వారీలు

నెల రోజులుగా విజిలెన్స్ అధికారులు 20 క్వారీల్లో తనిఖీలు నిర్వహించారు. ఎక్కువగా క్వారీయింగ్‌లో వినియోగించే డంపర్లు కాలం చెల్లినవి ఉన్నట్టు అధికారులు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా క్వారీ యజమానుల ఎక్స్‌ప్లోజివ్ సామగ్రిని నిల్వ ఉంచుతున్నారు. క్వారీల్లో బెంచ్ కటింగ్‌లు సక్రమంగా లేకపోవడాన్ని కూడా గుర్తించారు. అనుమతులను, క్వారీయింగ్ చేసే ప్రాంతాలను విజిలెన్స్ అధికారులు సర్వే చేయాల్సి ఉంది. అనుమతులు లేకుండా క్వారీయింగ్ చేస్తూ, రికార్డుల్లో మాత్రం లీజు ఉన్నచోట తవ్వకాలు చేస్తునట్లుగా క్వారీ యజమానుల చూపుతున్నారు.

● మైనింగ్ శాఖను రికార్డులు కోరిన విజిలెన్స్

క్వారీలకు అనుమతులు, వాటి సరిహద్దులు తెలిపే మ్యాప్‌లు ఇవ్వాల్సిందిగా మైనింగ్ అధికారులను విజిలెన్స్ అధికారులు కోరుతూ లేఖ రాశారు. మైన్స్ శాఖ అనుమతులతో క్వారీ లీజు అనుమతులు, సరిహద్దులు పరిశీలిస్తే గ్రానైట్ అక్రమాలు బట్టబయలు అయ్యే అవకాశం ఉంది. కోట్ల రూపాయల ఖజానాకు గండి కొడుతూ సాగుతున్న అక్రమ వ్యాపారం గుట్టురట్టు అవుతుంది.

ఘనంగా నటరాజ పూజా దినోత్సవం


నిర్వాహకులతో సన్మానగ్రహీతలు

ఒంగోలు కల్చరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): సంస్కార భారతి ఆధ్వర్యంలో ఆదివారం నటరాజ పూజా దినోత్సవం ఘనంగా జరిగింది. ఒంగోలు నగరం పత్తివారి రామాజనుజకూటంలో జరిగిన సదస్సులో రాష్ట్రీ స్వయంసేవక సంఘ విభాగ్ ప్రచార ప్రముఖ్ నవీన్ మాట్లాడుతూ గురువు లేని విద్వత్తు శూన్యమన్నారు. అష్టాదశ పురాణాలను రచించిన వేదవ్యాసుని జన్మతిధిని నటరాజ పూజా దినోత్సవంగా జరుపుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా సీఎస్ఆర్ శర్మ కళాశాల విశ్రాంత అధ్యాపకులు వేమూరి చిరంజీవి, వీణ విద్వాన్ తూములూరి నాగలక్ష్మి, గీతాచార్య పుష్పవల్లి తాయారులను ఘనంగా సత్కరించారు. అనంతరం తూములూరి నాగలక్ష్మి శిష్యబృంద సభ్యులు దేవసేన, చాందిన, మానసిల వీణానాదం సభికులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంస్కార భారతి రాష్ట్ర కార్యదర్శి రంగమన్నార్, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరి వేంకటశ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌కు సత్కారం


ఖాజావలికి కేక్‌ను తినిపిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన మద్దిరాలపాడు గ్రామానికి చెందిన షేక్ ఖాజావలిని టీడీపీ నాయకుడు, క్లస్టర్ ఇన్‌చార్జి గుమ్మడి సాయిబాబా, నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక బస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఖాజావలి, స్థానిక నాయకులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. తనకు పదవి వచ్చేలా కృషి చేసిన ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, గ్రామ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పెనుబోతు సునీల్, సర్పంచ్ స్వర్ణ అనురాధ, తాళ్లూరి ఆంజనేయులు, నెప్పల కృష్ణమూర్తి, పెనుబోతు శ్రీనివాసరావు, గుమ్మడి సురేష్, కాటా శ్రీనివాసరావు, షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారసింహ కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఒంగోలు కల్చరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పప్పుబజారులో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీ నారసింహ స్వామి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీసీతారామ బాలభక్త సమాజం 65వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ కళ్యాణోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గుర్రం వెంకటనాగప్రసన్నశ్రీకాంత్, చిన్నయిలక్ష్మీనరసింహగిరిజ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. వేదపండితులు నల్లూరి రవికుమారాచార్యులు యాజ్ఞీకంలో విష్వక్సేన ఆరాధన, కంకణధారణ, కలశారాధన, యజ్ఞోపవీత ధారణ, స్వామివారికి అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ, మాంగల్యధారణ మొదలైన క్రతువులను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రదర్శించిన కోలాట ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బాలభక్త సమాజ కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


మందులను అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

చీమకుర్తి, జూలై13 (ఆంధ్రజ్యోతి) : సినీనటుడు బూచేపల్లి కమలాకరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం చీమకుర్తిలోని బీబీఎస్ఆర్ కళ్యాణమండపం ఆవరణలో నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరానికి మెగా స్పందన లభించింది. దాదాపు 1600 మంది హాజరు కాగా వారిలో 650మందికి ఆపరేషన్లు అవసర మని శంకర కంటి ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి, కుటుంబసభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రవణా నక్షత్ర పూజలు

సంతనూతలపాడు, జూలై 13(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రవణా నక్షత్ర పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు పరాంకుశం ప్రసాదచార్యులు, అజయ్‌బాబుచార్యులు స్వామివారికి అభిషేకాలు చేశారు. స్వామివార్లకు పల్లపోతుసుబ్బారాయుడు, శైలజ దంపతులు రూ.15వేలు విలువ చేసే రోల్డ్ గోల్డ్ కిరీటాన్ని అందజేశారు. తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఉన్నతస్థానాలు చదువుతోనే సాధ్యం

● ఎమ్మెల్యే దామచర్ల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కల్చరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): చదువు మనిషికి విజ్ఞానాన్ని పెంచి ఉన్నత స్థానానికి చేరుస్తుందని, అటువంటి చదువుకు పేదరికం అడ్డు కాకూడదని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సంతపేట సాయిబాబా మందిర కళ్యాణమండపంలో ఏర్పాటుచేసిన కవర్తపు ఆదిలక్ష్మమ్మ మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ 22వ వార్షికోత్సవం కవర్తపు బాలకృష్ణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు ప్రభుత్వం చేయూతనిస్తుందని, అదేవిధంగా తమ ట్రస్ట్ ద్వారా కూడా సహాయం అందజేస్తున్నామని చెప్పారు. సంస్థ వ్యవస్థాపకులు కవర్తపు శ్రీనివాసరావు సామాజిక సేవాదృక్పథం గల వ్యక్తి అని, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహిస్తున్న కుటుంబ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరచిన పేద విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గుంటి మోహనరావు, కవర్తపు వెంకటప్రసాదరావు, జంజనం శ్రీనివాసరావు, అవ్వారు మునలయ్య, గుద్దంటి లక్ష్మీనారాయణ, కవర్తపు రామమోహన్‌రావు, డాక్టర్ అవినాష్, బండి రామకృష్ణ, మురళి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి

● ఎమ్మెల్యే బీఎన్


మహిళకు కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పేర్నమిట్ట 40వ డివిజన్ క్రిస్టియన్‌పాలెంలో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బీఎన్‌కు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలకారు. అనంతరం ఆయన ఇంటింటికి తిరుగుతూ రాష్ట్రంలో కూమటి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ముద్రించిన కరపత్రాలను ఎమ్మెల్యే ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసిన కొద్దినెలల్లోనే రాష్ట్రంలో అధ్వానంగా రోడ్లకు మరమ్మతులు, నూతన సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించినట్లు చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతులకల్పనకు కృషిచేసిన గొప్ప ముఖ్యమంత్రి అని కొనియాడారు. నేడు రాష్ట్రంలోకి ప్రపంచ నలుమూలల నుంచి పెద్దపెద్ద కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువస్తున్నాయంటే అది మన చంద్రబాబు నాయుడు దూరదృష్టి చూసేనని అని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరిశ్రీను, నాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, గోవిందు, బ్రహ్మయ్య, వెంకటేశ్వరరెడ్డి, క్రిష్ణ చైతన్య, శ్రీను, చిన్న తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● సమ్మెకు దిగిన శ్రామికులు


ఒంగోలులోని ఫిల్టర్ బెడ్ వద్ద నిరసన తెలియజేస్తున్న కార్మికులు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మునిసిపల్, కార్పొరేషన్‌లలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు పిలుపునివ్వగా ఆదివారం జిల్లాలో కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా ఆయా మునిసిపల్ కార్యాలయాలు, ఫిల్టర్ బెడల్‌ల వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వాటర్ లైన్‌మెన్‌లు, పార్కులు, బోరింగ్‌లు రిపేరు, మొక్కలు, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటరు ఆపరేటర్లు తదతర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల అందరికీ వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. గత ఏడేళ్లుగా వేతనాలు పెంచలేదన్నారు. గతంలో జరిగిన సమ్మె కాలంలో ఇచ్చిన మాట ప్రకారం వేతనాలు పెంచాలని చెప్పారు. రానున్న రోజుల్లో తమ న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మె ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా సుమారు ఐదువందల మంది కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొనగా, ఒంగోలులో యూనియన్ నగర కార్యదర్శి టి.విజయమ్మ, కె.వెంకట్రావు, జాలయ్య, మోహన్, రామారావు, సుధాకర్, ప్రసన్న, సింగయ్య, వెంకటస్వామి, శ్రీదేవి పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గంలో ముగ్గురికి చోటు

● మంత్రి స్వామి ప్రతిపాదన

మర్రిపూడి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత మండలానికి చెందిన ముగ్గురు టీడీపీ నేతలకు నామినేటెడ్ పోస్టులు దక్కాయి. కొండపి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంలో మండలం నుంచి ముగ్గురు సభ్యులను రాష్ట్రమంత్రి స్వామి, మారిటైంబోర్డ్ చైర్మన్ సత్య ప్రతిపాదించారు. మండల కేంద్రమైన మర్రిపూడికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యురాలు సారెడ్డి సాయమ్మ, మర్రిపూడి పంచాయతీ పరిధిలోని దుగ్గిరెడ్డిపాలేనికి చెందిన బూదాల ఏసుదాసు, గుండ్లసముద్రం పంచాయతీలోని ఎస్టీ రాజుపాలేనికి చెందిన జగన్నాథం శ్రావణీలను ప్రతిపాదించారు. ఎస్సీ కులానికి చెందిన ఏసుదాసు లా పట్టభద్రుడు. 30 సంవత్సరాల లోపు యువకుడు. టీడీపీ సోషల్ మీడియాలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. గిరిజన తెగకు చెందిన శ్రావణి కూడా యువకురాలు. దివంగత మాజీమంత్రి దామచర్ల హయాంలో సాయమ్మ జడ్పీటీసీ సభ్యురాలిగా కొనసాగారు. ఇద్దరు మహిళలు, ఒక పురుషునికి పాలకవర్గంలో చోటు కల్పించడంతోపాటు ఎస్సీ, ఎస్టీ, ఓసీలకు సమప్రాధాన్యత కల్పించారు. సీనియర్లను పక్కన పెట్టారనే ఆరోపణలు సైతం కార్యకర్తల్లో వినిపించాయి. మర్రిపూడి, చిమట సహకార సంఘాలకు కూడా త్రిసభ్య కమిటీలను త్వరలో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిసింది. మర్రిపూడి సొసైటీకి సీనియర్ నాయకులు యర్రమోతు శ్రీనివాసులు, చిమట సొసైటీకి మలసాని కోటేశ్వరరావుల పేర్లు ప్రతిపాదించినట్లు సమాచారం. ఇక పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయ పాలకవర్గం దక్కించుకునేందుకు పలువురు సీనియర్ నాయకులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక ఆష్టోనా హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి క్లబ్ సీనియర్ ప్రతినిధి అన్నే రత్నప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేయాలన్నారు. ఇప్పటికే పాఠశాలలకు కుర్చీల బహూకరణ, పారిశుధ్యం, దివ్యాంగులకు వీల్‌చైర్‌లు పంపిణీతోపాటు ఆరోగ్య శిబిరాలు తదితర సేవల్లో ఉత్తమ సేవా సంస్థగా అవార్డు సాధించడం కమిటీ పనితీరుకు నిదర్శనం అన్నారు. అనంతరం కమిటీ అధ్యక్షుడిగా రావిపాటి శ్రీనివాసరావు, కార్యదర్శిగా కొల్లూరి శ్రీనివాసరావు, కోశాధికారిగా ఆర్ల శ్రీరామమూర్తి, ట్రైనర్‌గా మేకల కొండయ్య, డైరెక్టర్లుగా మండవ నాగేశ్వరరావు, గనిపినేని హరిబాబు, మొలకలపల్లి హరిబాబు, బొమ్మినేని రమణ, వేమూరి వెంకయ్య ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ పి.శివన్నారాయణ, క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఆర్.అంకమ్మచౌదరి, రావి సత్యనారాయణ, ప్రస్తుత కమిటీ అధ్యక్షులు మాకినేని మురళీకృష్ణ, సెక్రటరీ నర్రా సురేంద్రబాబు, కోశాధికారి తాళ్ళ రామచంద్రరెడ్డి, మాజీ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, గుమ్మడి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే బీఎన్


కార్తీక్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఘడియపూడి మాజీ సర్పంచ్, టీడీపీ నేత అన్నమనేని సుబ్బారావు తనయుడు కార్తీక్ శనివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఆయన భౌతికకాయాన్ని ఆదివారం సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ మండవ జయంత్‌బాబు, మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, గట్టినేని అయ్యన్న, చింతల శ్రీనివాసరావు, దుగ్గినేని నరసింహారావు, నారిపెద్ది వరహాలచౌదరి, ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: అనారోగ్యంతో మృతి చెందిన నాగులుప్పలపాడు గ్రామానికి తెలుగుదేశం పార్టీ నాయకుడు పోలినేని శ్రీనివాసరావు మృతదేహానికి ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఆదివారం పార్టీ కండువా కప్పి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట క్లస్టర్ ఇన్‌చార్జి గుమ్మడి సాయిబాబా, మారెళ్ల వెంకటశేషయ్య, ఉప్పుటూరి హరినాథ్, గూడూరి ఝాన్సీ, చుండూరి నాగేశ్వరరావు, కొంజేటి ధనుష్, పల్లపోతు సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల కేటాయింపు రద్దు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రామ్‌దేవ్‌బాబాకు ప్రభుత్వ భూముల కేటాయింపును రద్దు చేయాలని హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్యడిమాండ్ చేశారు స్థానిక ఎంసీఏ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయిబాబా శతజయంతిని ప్రభుత్వ పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం సిగ్గు చేటన్నారు. గుడ్లూరు మండలం చేవూరు వద్ద రామదాత స్వామి నుంచి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మళ్ల నరసింహారావు, రాజశేఖర్, రాఘవరావు, కాలేషాబేగ్, చంద్రశేఖర్, సుభాని, బి.సుబ్బారావు, ఎస్వీ.రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొండపి, జూలై13 (ఆంధ్రజ్యోతి): పెట్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ లైన్ల మరమ్మతు పనుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని పెట్లూరు, కోయవారిపాలెం, చవటపాలెం, దాదానాయుడుపాలెం, గుర్రప్పడియ, గ్రామాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని కొండపి విద్యుత్ ఏఈ పువ్వాడి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఒంగోలు పొగాకు వేలంకేంద్రం-2 షెడ్యూల్

ఒంగోలు(రూరల్), జూలై13(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలంకేంద్రం-2లో జరిగే 12వరౌండ్ వేలానికి ప్రతి బ్యారన్‌కు ఐదు బేళ్ల వంతున రైతులు తీసుకురావాలని వేలంనిర్వహణాదికారి జె.తులసి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలానికి ఈనెల 15వ తేదీన పోతవరం, వెంగముక్కపాలెం, సర్వేరెడ్డిపాలెం, కె.మామిడిపాలెం, యరజర్ల, చెరువుకొమ్ముపాలెం రైతులు బేళ్లను తీసుకురావాలన్నారు. అలాగే 16న ఒంగోలు, గుత్తికొండవారిపాలెం, అనుబ్రోలువారిపాలెం, కేశినేనివారిపాలెం, ప్రాసంగలపాడు, ఉప్పుగుండూరు, చదలవాడ, కొప్పోలు, సూరారెడ్డిపాలెం, 17న అమ్మనబ్రోలు, చవటపాలెం, రాపర్ల, మాచవరం, 18న నాగులుప్పలపాడు, ఒమ్మెవరం, ఓబన్నపాలెం, మండవవారిపాలెం, ముక్తినూతలపాడు, 19న చీర్వానుప్పలపాడు, దొడ్డవరప్పాడు, వెంకటరాజుపాలెం, ఏడుగుండ్లపాడు, ఉలిచి, 21న టి.అగ్రహారం, వలేటివారిపాలెం, మద్దిరాలపాడు, 22న చేకూరపాడు, ఇనమనమెళ్లూరు, ఆలూరు, గాదెపాలెం, 23న దశరాజుపల్లి, గుడిమెళ్లపాడు, బొద్దులూరివారిపాలెం, దేవరంపాడు, కరవది, త్రోవగుంట, పానకాలపాలెం గ్రామాల రైతులు పొగాకు బేళ్లు తీసుకురావాలని కోరారు. ప్రతి బేలు 150కేజీల బరువు మించకూడదని ఆమె పేర్కొన్నారు.

రేపు ప్రభుత్వ పెన్షనర్ల ధర్నా

ఒంగోలు(రూరల్), జూలై13(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బడే అంకిరెడ్డి, డాక్టర్ కంచర్ల సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రప్రభుత్వం ఆర్థికబిల్లుతో పాటు పెన్షన్ వ్యాలిడేషన్ అమెండ్‌మెంట్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లును అమలు చేస్తే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్లతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ పెన్షనర్లు కూడా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ బిల్లును రద్దు కోసం జరిగే ధర్నాకు ప్రభుత్వ పెన్షనర్లు తప్పక పాల్గొనాలని కోరారు.

చర్మవ్యాధులపై అవగాహన


సమావేశంలో పాల్గొన్న వైద్యులు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని హౌసింగ్ బోర్డు కాలనీలోని బొమ్మరిల్లు కేంద్రంలో ఆదివారం ప్రపంచ చర్మవ్యాధుల దినోత్సవం నిర్వహించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్ వినేరియాలజిస్ట్ అండ్ లెప్రాలజిస్ట్ ఆధ్వర్యంలో పలువురు వైద్యులు చర్మము, గోర్లు, వెంట్రుకలు, జననేంద్రియాలు సంబంధించినటువంటి సమస్యల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు డాక్టర్ బాలాజీనాయక్, సెక్రటరీ డాక్టర్ చైతన్య, వైద్యులు జయ, శ్యామసుందరి పాల్గొన్నారు.

మహిళలపై దాడులు దుర్మార్గం

● జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలపై తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న దాడులు పరాకాష్టకు చేరాయని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆరోపించారు. ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ నాయకులు దాడి చేయడం దారుణమని విమర్శించారు. ఇటువంటి దాడులను అరికట్టకపోతే రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో దుంపా రమణమ్మ పాల్గొన్నారు.

బౌద్ధ భిక్షువుల ప్రత్యేక పూజలు

మద్దిపాడు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం జపాన్, శ్రీలంకకు చెందిన బౌద్ధ భిక్షువులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం రాజశేఖర్ ఆచార్యులు, నారాయణం వెంకటాచార్యులు వారికి స్వామివారి ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా బౌద్ధ భిక్షువులు మాట్లాడుతూ భారతదేశంలోని అనేక దేవాలయాలను తాము సందర్శిస్తున్నట్లు చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

నాగులుప్పలపాడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిమ్మసముద్రంలోని పేకాటశిబిరంపై ఎస్ఐ రజియాసుల్తానా తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. 11 మంది జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.46,330 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేస్‌లో 100 మందికి వైద్య సేవలు

ఒంగోలు విద్య, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. విజయడయాగ్నిస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో కళాశాల సిబ్బంది 100 మందికి పలు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ తమ కళాశాల సిబ్బంది ఆరోగ్యం మెరుగుకు అవసరమైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ సీవీ.సుబ్బారావు, ఆర్.వీరాంజనేయులు, ఏవో ఎం.రాంబాబు, కో ఆర్డినేటర్ పి.బాషా తదితరులు పాల్గొన్నారు.

17న బీసీ జాతీయ మహాసభ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 17వ తేదీన జరగనున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభను విజయవంతం చేయాలని పలువురు పిలుపునిచ్చారు. స్థానిక అంజయ్యరోడ్డులోని బీసీ సామాజిక భవన్‌లో ఆదివారం మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. విజయవాడలో జరిగే జాతీయమహసభలో కేంద్రమంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, ఇంద్రజిత్‌సింగ్, పాటు బీసీ రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు, ఎంపీలు హాజరవుతారన్నారు. జిల్లాలోని బీసీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆవుల నరసింహారావు, కె.నాగేశ్వరరావు, మద్దులూరి శ్రీనివాసులు, వై.వెంకట్రావు, సంజీవరావు, గోగు శివుడు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, గంటా శ్రీనివాస్, దండు ఆంజనేయులు, తన్నీరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

సంతనూతలపాడు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మంగమూరు గ్రామంలో ఆదివారం వేకువజామున గుండెపోటుతో మృతిచెందిన టీడీపీ కార్యకర్త కంకణాల మురళీ కుటుంబసభ్యులకు పార్టీ తరుపున రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మురళీ మృతదేహానికి టీడీపీ వర్కింగ్ ప్రెసెడెంట్ అబ్బూరిశ్రీనివాసరావు, నారాయణరావు, కృష్ణారావు నివాళులర్పించారు. కార్యక్రమంలో యుగంధర్, గోపి, బుజ్జి, కొండసింగ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి వనం అభివృద్ధికి సహకారం


శ్రీవారి వనాన్ని పరిశీలిస్తున్న నిర్వాహకులు

మద్దిపాడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని శ్రీవేంకటేశ్వర స్వామి సన్నిధిలోని శ్రీవారివనం అభివృద్ధికి అన్నివిధాల సహకరిస్తానని ఒంగోలు పబ్లిక్ స్కూల్ చైర్మన్ నల్లూరి క్రాంతి కుమార్ అన్నారు. ఆదివారం ఆయన శ్రీవారి వనం విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంపకంతో దేవాలయ పరిసరాలు ఎంతో అందంగా తయారవుతాయన్నారు. కార్యక్రమంలో శ్రీవారివనం కమిటీ అధ్యక్షుడు మార్నేని కృష్ణారావు, సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, బోయపాటి రవి, చుండూరు చలపతి, తేళ్ల వెంకటసుబ్బారావు, ఓలేటి వెంకట్రావు, పల్లకి రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.


త్రిపురాంతకం ప్రాంతంలో సాగులో ఉన్న పత్తిపంట

పంటకు బీమా రైతుకు ధీమా

● పత్తికి 15వ తేదీ, మిగిలిన పంటలకు 31వరకు గడువు

త్రిపురాంతకం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా పథకం రైతులకు సురక్ష లాంటిది. ప్రతి దానికి బీమా ఉన్నట్లే పంటలకు కూడా బీమా ఉంటుందన్న విషయం రైతులకు తెలియక పోవడంతో విపత్తు సమయాల్లో పంటనష్టం వాటిల్లినప్పుడు సహకారం దొరకక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి సమయాల్లో రైతులకు రక్షగా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటల బీమా పథకాన్ని తీసుకొచ్చింది. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ద్వారా వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తుంది. ఈ పథకం ద్వారా కాలానుగుణంగా వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల పంట నష్టం కలిగే ఆర్థిక ఇబ్బందుల వల్ల రైతులను కాపాడేందుకు ఖరీఫ్‌లో ఈ పథకాన్ని అమలులోకి తెచ్చారు. ఈ పథకం రాష్ట్రంలోని కేవలం 9 జిల్లాల్లో అమలులో ఉండగా అందులో ప్రకాశం జిల్లా కూడా ఒకటి. అయితే జిల్లాలో పత్తి పంటకు మాత్రమే ఈ పథకం ద్వారా బీమా సౌకర్యం కల్పించారు. పత్తి రైతులు ఎకరాకు రూ.2,100 చెల్లిస్తే రూ.42,000 బీమా మొత్తం రైతుకు దక్కుతుంది. ఇందుకుగాను దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 15వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వ్యవసాయాధికారులు కోరుతున్నారు.

పంటలకు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలు

పంట	ఎకరాకు ప్రీమియం	అందే బీమా	చివరితేదీ
వరి	రూ.860	రూ.43,000	ఆగస్టు15
కంది	రూ.430	రూ.21,500	జూలై 31
సజ్జ	రూ.156	రూ.15,600	జూలై 31
మిర్చి	రూ.4,500	రూ.90,000	జూలై 31
మినుము	రూ.205	రూ.20,500	జూలై 31
నువ్వులు	రూ.180	రూ.12,000	జూలై 31

దరఖాస్తు చేసుకునే విధానం

బ్యాంకు నుంచి పంట రుణం పొందిన రైతులు వారు రుణం తీసుకునే సమయంలో బీమా ప్రీమియం మొత్తాన్ని బ్యాంక్ వారు రైతు నుంచి తీసుకుని నేరుగా బీమా కంపెనీకి జమ చేస్తారు. బీమా పరిహారం వచ్చినప్పుడు ఆ మొత్తం కూడా నేరుగా వారి బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు. బ్యాంక్‌ల ద్వారా పంట రుణం పొందని రైతులు నేరుగా వారి దగ్గరలో ఉన్న కామన్ సర్వీస్ సెంటర్, సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్, పోస్టాఫీసు, పీఏసీఎస్ ద్వారా ఆధార్‌కార్డు, భూమి హక్కు పత్రాలు, పంటవేసిన ధ్రువపత్రాలు ఇచ్చి ప్రీమియం చెల్లించి రసీదు పొందాలి. బీమా మొత్తం వారు సూచించిన సేవింగ్స్ ఖాతాకు జమ చేస్తారు.

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం రాష్ట్రంలోని అన్నమయ్య, ఏలూరు, ప్రకాశం జిల్లాల్లో అమలు చేస్తున్నారు. ఈ పథకం దిగుబడి ఆధారిత బీమా పథకం. ఇందులో భాగంగా ప్రకాశం జిల్లాలో వరి, కంది పప్పు, సజ్జ, మిర్చి, మినుములు, నువ్వుల పంటలకు బీమా వర్తింపజేస్తున్నారు. ఈ పథకాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని ఎంపిక చేసింది. ఇందులో వరి పంటకు దరఖాస్తు గడువు ఆగస్టు 15తో ముగుస్తుండగా, మిగిలిన పంటలకు ఈనెల 31వ తేదీ వరకు మాత్రమే గడువు ఉన్నట్లు అధికారులు తెలిపారు.



రైతులు బీమాను వినియోగించుకోవాలి

ప్రభుత్వాలు రైతుల కోసం అందిస్తున్న పథకాలను రైతులు వినియోగించుకోవాలి. తక్కువ ప్రీమియం చెల్లించేందుకు కూడా వెనుకాడకుండా మనకు దక్కే బీమా సౌకర్యాన్ని చూసుకోవాలి. ప్రకృతి విపత్తులు చెప్పిరావు. అలాంటి సందర్భాల్లో రైతులకు ఎంతో సురక్ష కవచంలాగా ఈ బీమా పథకాలు ఉపయోగపడతాయి. పత్తి రైతులకు తక్కువ సమయం మాత్రమే ఉంది.

- సంగమేశ్వరరెడ్డి, వ్యవసాయాధికారి, త్రిపురాంతకం

పథకం ఉద్దేశం

తుఫాన్‌లు, కరువు, అకాల వర్షాల వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడమే పథకం ప్రధాన ఉద్దేశం. అదేవిధంగా వాతావరణ అంశాల ఆధారంగా సంభవించిన పంట నష్టం అంచనావేసి బీమాను వర్తింపజేస్తారు. ఎంపికచేయబడ్డ పంటలను సాగు చేస్తున్న రైతులు, కౌలురైతులు కూడా ఈ పథకంలో చేరటానికి అర్హులేనని అధికారులు వెల్లడించారు.


టంగుటూరు రోడ్డులో రంగసాని వాగు వద్ద ఆక్రమించి చదును చేసిన స్థలం

యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల ఆక్రమణ

● చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

కొండపి, జూలై13 (ఆంధ్రజ్యోతి): కొండపిలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ పర్వం జోరుగా సాగుతోంది. ప్రభుత్వ ఆధీనంలోని వాగులు, వంకలు ఆక్రమించి కొందరు అక్రమార్కులు తమ స్థలాల్లో కలుపుకుంటున్నారు. వాగుపోరంబోకు, అనాధీనం, కుంట పోరంబోకు స్థలాలను ఆక్రమించుకుని, తర్వాత విక్రయిస్తున్న ఘటనలు కొండపిలో ఈమధ్య కాలంలో వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చూడాల్సిన క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొండపిలోని టంగుటూరు రోడ్డులో రంగసాని వాగు వద్ద ఆర్‌అండ్ బీ అధికారులు హైలెవల్ బ్రిడ్జి నిర్మించారు. బ్రిడ్జి నిర్మించిన స్థలాన్ని కూడా అక్రమార్కులు వదిలిపెట్టలేదు. రంగసాని వాగుకు దక్షిణంవైపు పూర్తిగా చదును చేసి పక్కనున్న వ్యక్తి తమ స్థలంలో కలుపుకున్నాడు. రెవెన్యూ అధికారులు కళ్లుగప్పి ఆక్రమించి, తర్వాత వెంచర్లు వేసి దానిని రోడ్డుగా చూపి ప్లాట్లుగా అమ్ముకుంటున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి, పూడ్చిన స్థలాన్ని తిరిగి వాగులో కలపాలని స్థానికులు కోరుతున్నారు.


సూరారెడ్డిపాలెంలో ఏడాది పాలనపై కరపత్రం అందజేస్తున్న సత్య

గ్రామ సమస్యలు పరిష్కరిస్తా

● ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ సత్య

● సూరారెడ్డిపాలెంలో సుపరిపాలనలో తొలిఅడుగు ప్రచారం

టంగుటూరు, కొండపి, జూలై13 (ఆంధ్రజ్యోతి): సూరారెడ్డిపాలెంలోని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. ఆదివారం మండలంలోని సూరారెడ్డిపాలెంలో సుపరిపాలనలో తొలిఅడుగు ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో, ఎస్సీ కాలనీలో ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పెంచిన పింఛన్ డబ్బులు పంపిణీపై ఆరా తీశారు. తల్లికి వందనం పథకంలో పిల్లలందరికీ డబ్బులు పడ్డాయా? అనే విషయంతోపాటు త్వరలో అమలులోకి రానున్న అన్నదాత సుఖీభవ పథకం, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు పథకాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా పలువురు గడచిన వైసీపీ ప్రభుత్వంలో ఇళ్లు కట్టుకోమని చెప్పి తమకు బిల్లులు రాకుండా చేశారని, తమ ఇళ్లు పూర్తిచేసేందుకు నిధులు మంజూరు చేయించాలని సత్యకు విజ్ఞప్తి చేశారు. అలాగే గడచిన ఐదేళ్లలో గ్రామంలో అభివృద్ధి పనులు జరగలేదని, కాలనీలో సైడు కాల్వలు నిర్మించాలని, గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు సత్యకు విన్నవించుకున్నారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తామని ఈసందర్భంగా సత్య గ్రామస్థులకు హామీనిచ్చారు.

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు

● జిల్లాతో ప్రత్యేక అనుబంధం

● టి.కృష్ణ చిత్రాలలో విభిన్న నటన

● ఆయన మృతికి పలువురి సంతాపం

ఒంగోలు కల్చరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి):హావభావాలకే కాదు, డైలాగ్ డెలివరీలో సైతం ఆయనది ఒక ప్రత్యేకమైన శైలి. తను ఏ పాత్ర ధరిస్తే ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేసి ఆ పాత్రకు జీవం పోసే బహుముఖ ప్రజ్ఞాశాలి. నాలుగు దశాబ్దాల సినీ ప్రస్థానంలో హాస్యనటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, విలన్‌గా ఎన్నో పాత్రలు పోషించిన కోట శ్రీనివాస రావు మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరనిలోటని చెప్పొచ్చు. అదేవిధంగా కోట శ్రీనివాస రావుకు జిల్లాతోను అనుబంధం ఉంది. మన జిల్లాకు చెందిన సంచలన దర్శకుడు టి.కృష్ణ దర్శకత్వంలో అనేక చిత్రాలలో నటించారు. 1978లో ప్రాణం ఖరీదు చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసిన కోట శ్రీనివాసరావు టి.కృష్ణ దర్శకత్వంలో వచ్చిన వందేమాతరం, ప్రతిఘటన, రేపటిపౌరులు వంటి చిత్రాలలో పోషించిన పాత్రలు ఆయనకు ఒక ప్రత్యేకమైన గుర్తింపును తీసుకువచ్చాయి. ఈ చిత్రాలకు మాటల రచయిత అయిన ఒంగోలుకు చెందిన ఎంవీఎస్‌హరనాథరావుతో కోట శ్రీనివాసరావుకు మంచి స్నేహసంబంధం ఉండేది. అదేవిధంగా జిల్లాకు చెంది చిత్ర పరిశ్రమలో స్థిరపడిన గాయకుడు, సినీ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్‌తోను కోట శ్రీనివాస రావుకు మంచి అనుబంధం ఉంది. ఇక ఒంగోలుకు చెందిన ప్రముఖ వైద్యులు, చిత్రకారులు డాక్టర్ మాచిరాజు రామచంద్రరావు అంటే కూడా కోట శ్రీనివాసరావుకు ఎంతో అభిమానం. 2006వ సంవత్సరంలో ఒంగోలు వచ్చిన సందర్భంగా ఆయన ప్రత్యేకంగా డాక్టర్ రామచంద్రరావు గృహానికి వెళ్లి ఆయన గీసిన చిత్రాలను చూసి అభినందించారు.


తన చిత్రాల గురించి కోట శ్రీనివాసరావుకు వివరిస్తున్న డాక్టర్ రామచంద్రరావు

ఇక నటుడిగా గుర్తింపు పొందిన కోట శ్రీనివాసరావు భారతీయ జనతా పార్టీ ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ్యునిగా 1999లో గెలుపొందారు. 2000 సంవత్సరంలో ఆయన భారతీయ జనతా పార్టీ జిల్లా ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆ సందర్భంగా జిల్లాలోని ఒంగోలు, గిద్దలూరు, పొదిలి వంటి అనేక ప్రాంతాలలో పర్యటించారు. ఈ విధంగా కోట శ్రీనివాసరావు రాజకీయ నాయకునిగా సైతం జిల్లాతో అనుబంధం ఉంది.

పలువురి సంతాపం

ఇక కోట శ్రీనివాసరావు మృతి పట్ల పలువురు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి పైకి వచ్చిన గొప్ప నటుడని, ఆయనకు ఏ పాత్ర ఇచ్చినప్పటికీ దానికి నూటికి నూరు శాతం న్యాయం చేస్తాడని ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) అన్నారు. కోట శ్రీనివాస రావు మృతి తనను తీవ్ర దిగ్ర్భాంతికి గురిచేసిందన్నారు. తన చిత్రాలు చూసి అభినందించినప్పుడు కలిగిన ఆనందం మరిచిపోలేనిదని డాక్టర్ మాచిరాజు రామచంద్ర రావు గుర్తుచేసుకున్నారు. కోట మృతికి సంతాపం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకునిగా కోట శ్రీనివాసరావు భారతీయ జనతా పార్టీలో ఎంతో నిబద్ధతో పనిచేశారని జిల్లా భారతీయ జనతా పార్టీ మీడియా కన్వీనర్ ధనిశెట్టి రామునాయుడు అన్నారు. అదేవిధంగా నటుడు, గాయకుడు మరుధూరి సాయిబాబు, శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు, అన్నమయ్య సాహిత్య సేవా సమితి అధ్యక్షుడు ఐ.మురళీకృష్ణ, నటులు మిడసల మల్లిఖార్జునరావు, కనమాల రాఘవులు, లలిత కళా అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వర రావు తదితరులు కోట శ్రీనివాస రావు మృతికి సంతాపం తెలియజేశారు.


కోట శ్రీనివాసరావుతో నటుడు, గాయకుడు మరుధూరి సాయి

పీఎస్‌హెచ్‌ఎంలకు నేటి నుంచి శిక్షణ

ఒంగోలు విద్య, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు(పీఎస్ హెచ్‌ఎం), సెకండరీ గ్రేడ్ టీచర్లకు సోమవారం నుంచి ఈనెల 17వతేదీ వరకు లీడర్‌షిప్ శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పొదిలిలోని జోసఫ్ శ్రీహర్ష అండ్ మేరీ ఇంద్రజ ఎడ్యుకేషనల్ సొసైటీలో రెసిడెన్షియల్ విధానంలో ఈ శిక్షణ జరుగుతుందన్నారు. ఈ కార్యమానికి కోర్సు చైర్మన్‌గా మర్రిపూడి మండల విద్యాధికారి-1 వ్యవహరిస్తారు. ఈ శిక్షణ మొదట సెషన్‌కు 320 మంది ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సెకండరీ గ్రేడ్ టీచర్లు హాజరు అవుతారన్నారు. శిక్షణకు హాజరు కావాల్సిన టీచర్ల జాబితాలను సంబంధిత మండల విద్యాధికారులకు పంపించామని, శిక్షణకు కేటాయించిన పీఎస్‌హెచ్‌ఎంలను మండల విద్యాధికారులు రిలీవ్‌చేసి పంపించాలని ఆయన ఆదేశించారు.

ముగిసిన మొహర్రం వేడుకలు

● పీర్లకు గ్రామోత్సవం

తర్లుపాడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మతసామరస్యానికి ప్రతీకగా మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. తర్లుపాడులో పీర్ల గ్రామోత్సవం ఆదివారం నిర్వహించారు. భక్తులు పీర్లకు చదివింపులు చెల్లించి మొక్కుబడులు తీర్చుకున్నారు. 3 చావిడిలలోని పీర్లకు గ్రామోత్సవం నిర్వహించడంతో వీధులన్నీ జనసంద్రంగా మారాయి. అనంతరం పీర్లను పెద్ద బావి వద్ద నీళ్ల తాకించే కార్యక్రమంతో మొహర్రం వేడుకలు ముగిశాయి. కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఖాశింస్వామి వారిని దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ బ్రహ్మనాయుడు బందోబస్తును ఏర్పాటు చేశారు.


తర్లుపాడులో పీర్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ప్రపంచ శాంతి కోసం సైకిల్ యాత్ర

ప్రపంచ శాంతి కోసం ఓ వృద్ధుడు సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టాడు. కర్ణాటకకు చెందిన నాగరాజు గౌడ్ అనే వృద్ధుడు కుటుంబ జీవనోపాధి కోసం నిత్యావసర సరుకుల దుకాణం నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే ప్రపంచ శాంతి బాట పట్టిన నాగరాజు 2022లో ప్రపంచ సైకిల్ యాత్రను చేయాలని భావించాడు. ఈ మేరకు మూడేళ్లుగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ ఆదివారం ఒంగోలు చేరుకున్నారు. ఈ ఏడాది కుంభమేళాలో పాల్గొని ప్రయాగ్‌రాజ్ నుంచి యాత్రను కొనసాగిస్తున్న ఆయన ఇప్పటికే బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్‌మీదుగా చెన్నై వెళ్లనున్నట్లు తెలిపారు. తన యాత్రలో భాగంగా ఆయన ఆయా రాష్ట్రాల ఐదుగురు ముఖ్యమంత్రులను, సినీ హీరోలను కలిసినట్లు వెల్లడించాడు.

- ఒంగోలు, కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)



ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఒంగోలులోని ది లార్డ్ కృష్ణ షటిల్ బ్యాడ్మింటన్ అకాడమిలో 52వ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. అండర్ 11,13,15,17,19 సీనియర్స్, పురుషులు, స్త్రీల విభాగంలో ఈ పోటీలు నిర్వహించగా, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాలుర సింగిల్స్ విభాగంలో చర్విక్ జై విజయం సాధించగా, డబుల్స్ విభాగంలో అరుఆనందన్, చర్విక్ జై విజేతలుగా నిలిచారు. అండర్ 13 సింగిల్స్‌లో ఆపరాన్ విజయం సాధించగా, డబుల్స్ విభాగంలో అకిల్, సంకల్ప్ విజయం సాధించారు. అండర్ 15 బాలుర సింగిల్స్ విభాగంలో షణ్ముఖ్ వర్ధన్ విజయం సాధించగా, డబుల్స్ విభాగంలో షణ్ముఖ్ వర్ధన్, అఫ్రాన్, అండర్ 11 బాలికల సింగిల్స్ విభాగంలో ఇషిత విజయం సాధించగా, డబుల్స్ విభాగంలో ఎస్విత, హర్షిణి గెలుపొందారు. అండర్ 13 విభాగంలో ఇషిత విజయం సాధించగా, డబుల్స్ విభాగంలోఎస్విత, హర్షిణి, అండర్ 15 విభాగం సింగిల్స్‌లో ఎస్‌కే. రబియా, డబుల్స్ విభాగంలో వినూత్న, ఎస్‌కే. రబియా గెలుపు సాధించారు. అలాగే అండర్ 17 బాలుర సింగిల్స్‌లో జి. షణ్ముఖ, డబుల్స్‌లో వై.తారక్ రామ్, ఆరూప్ గెలుపొందారు. అండర్ 19 డబుల్స్‌లో జి. హర్విత్, అభిలాష్ గెలుపు సాధించారు. పురుషుల విభాగంలో ఆర్. రాహుల్, డబుల్స్‌లో రాహుల్, శశి, అండర్ 19 మిక్స్‌డ్ డబుల్స్‌లో హర్షిత్ సాయి, వినూత్నతో పాటు పలువురు క్రీడాకారులు విజయం సాధించారు. ఈ సందర్భంగా లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమి ఫౌండర్, ప్రెసిడెంట్ అద్దంకి మురళీకృష్ణ, విజేతలకు ట్రోఫీ బహూకరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్ రెడ్డి, కార్యదర్శి పి. విజయ్ కృష్ణ, రఘు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ట్రోఫీలు, సర్టిఫికెట్లతో బ్యాడ్మింటన్‌లో వివిధ విభాగాలలో గెలుపొందిన క్రీడాకారులతో లార్డ్‌కృష్ణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

అడుగంటిన భూగర్భ జలాలు


మరమ్మతులకు గురైన బోరు

జేసీ అగ్రహారంలో నీటికి కటకట

బేస్తవారపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేసీ అగ్రహారం గ్రామస్థులు నీటికి కటకటలాడుతున్నారు. అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య చిన్నదైనప్పటికీ అధికారులు స్పందించడం లేదని దీంతో నీటి కోసం అవస్థలు పడుతున్నామని చెప్తున్నారు. నెల రోజుల కిందట తాగునీటి బోరు మరమ్మతులకు గురికావడంతో ఆ గ్రామంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సమీపంలోని మరో బోరు నుండి మరో వ్యవసాయ బోర్ల నుండి నీటిని తెచ్చుకుంటున్నారు.వ్యవసాయ పనులు చేసుకుంటున్న ఇక్కడి ప్రజలు నీటి కోసం గంటల సమయం పడుతుండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురైతున్నారు.అధికారులు స్పందిచి బోరుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


దూర ప్రాంతం నుంచి బిందెలతో తెస్తున్న నీరు

- తూముల ద్వారా లీకేజీతో ఖాళీ అవుతున్న కంభం చెరువు
- రోజుకు 25 క్యూసెక్కుల నీరు వృథా

కంభం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : చారిత్రాత్మక కంభం చెరువు నుంచి నీరు వృథాగా పోతున్నది. గత ఏడాది కురిసిన వర్షాలకు కంభం చెరువుకు 15 అడుగుల నీరు చేరింది. ప్రజలు, పర్యాటకులు తండోపతండాలుగా తరలివచ్చి చెరువుకు చేరిన నీటిని చూసి సంబరపడ్డారు. అయితే చెరువుకు ఉన్న 2 తూముల ద్వారా లీకేజీలు ఏర్పడడంతో నీరంతా వృథాగా బయటకు పోతుంది. ఆసియా ఖండంలోనే 2వ అతిపెద్ద చెరువుగా పేరున్న ఈ చెరువు 3 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యం ఉంది. గత ఏడాది నల్లమల అడవిలో కురిసిన భారీ వర్షాలకు జంపలేరు, గుండ్లకమ్మ ద్వారా చెరువుకు 15 అడుగులమేర నీరు చేరింది. లీకేజీల ద్వారా 2 తూముల ద్వారా ప్రతిరోజు 25 క్యూసెక్కులకు పైగా నీరు వృథాగా పోతున్నది. ఇదిలాగే మరో 2 నెలలు కొనసాగితే చెరువు మొత్తం ఖాళీ అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కంభం చెరువులో 5 అడుగుల మేర మాత్రమే నీరు


అడుగంటిన కంభం చెరువు

ఉంది. తూముల ద్వారా వృథాగా పోతున్న నీటికి ఇరిగేషన్ అధికారులు అడ్డుకట్ట వేయలేక పోతున్నానే విమర్శ ఉంది. చెరువు పూర్తిగా అడుగంటితే మండలంలోని సూరేపల్లి, కందులాపురం, లింగోజీపల్లి హజరత్‌గూడెం, చిన్నకంభం, పోరుమామిళ్లపల్లి తదితర గ్రామాలలో నీటి ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. నీరు పూర్తిగా ఇంకిపోతే కంభతోపాటు అర్ధవీడు, బేస్తవారపేట మండలాల్లో దాహంకేకలు తప్పవు. అదే కంభం చెరువులో నీరు ఉంటే కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల తోపాటుగా 25 గ్రామాలలో భూగర్భజలాలకు ఇబ్బంది ఉండదు. లేకుంటే తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడాల్సిందే. చిన్నకంభం తూము నుంచి నీరు ఎక్కువగా లీకవుతుంది. 2 సంవత్సరాల కిందట చిన్నకంభం తూము నుంచి నీటి వృథాను అరికట్టేందుకు రూ.17లక్షలతో అప్పటి ఇరిగేషన్ ఏఈ నాసిరకంగా, లోపభూయిష్టంతో మరమ్మతులు చేయడంతో నీటి వృథా ఎక్కువైంది. దీనికి తోడు 5వేల హెక్టార్ల విస్తీర్ణం కలిగిన సువిశాలమైన కంభం చెరువు నుంచి నీరు ఆవిరి అవుతున్నది. తూములు, కాలువల మరమ్మతులకు కోట్ల రూపాయలు మంజూరవుతున్నా బూడిదలో పోసిన పన్నీరవుతున్నది. ప్రస్తుతం కాలువల పూడికతీత, మరమ్మతులకు రూ.35 లక్షలతో చేపట్టిన పనులు ఎంత వరకు పూర్తయ్యాయో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు తూముల నుంచి వృథాగా పోతున్న నీటిని ఆపేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


చిన్నకంభం తూము ద్వారా వృథాగా పోతున్న నీరు


పెద్దకంభం తూము ద్వారా వృథాగా పోతున్న నీరు


మాట్లాడుతున్న వసంతలక్ష్మి

హామీలు నెరవేర్చే ప్రభుత్వం

మార్కాపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను నెరవేర్చేది ప్రభుత్వమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంత లక్ష్మి అన్నారు. 7వ వార్డులో ఆదివారం తల్లికి వందనం లబ్ధిదారులతో ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అమ్మఒడి పేరుతో ఇచ్చారన్నారు. అప్పట్లో ఎన్నికల్లో ఆ పార్టీ ఇంట్లో ఎంతమందివున్నా ఇస్తామని చెప్పి తల్లులను మోసం చేసిందన్నారు. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఇంట్లో ఎంతమంది చదువుకుంటే అందరికీ తల్లికి వందనం వర్తింపచేసిందన్నారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి ముఖ్యమం త్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు మర్రి ఝాన్సీరాణి, వార్డు టీడీపీ నాయకులు, మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వ్యాసరచన విజేతలకు బహుమతులు

గిద్దలూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖ గ్రంథాలయం ఆవరణలో దవడం మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. జస్మిత, మణికంఠ రెడ్డి, అభిషేక్‌రెడ్డి మొదటి 3 స్థానాలు పొందగా వారికి యువ ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ సభ్యులు కె.శ్రీనివాసులు బహుమతులను అందచేశారు. ప్రతిభ కనపరచిన పలువురు విద్యార్థులకు కొన్సొలేషన్ బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి ఫరూఖ్, సభ్యులు పాల్గొన్నారు.

220 మందికి వైద్య పరీక్షలు

గిద్దలూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లోని విహార్ క్లినిక్‌లో ఆదివారం ఉచిత ఆర్థోక్యాంప్ నిర్వహించారు. నంద్యాలకు చెందిన నెరవాటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలోని ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు డాక్టర్ కె.సుమన్‌కుమార్ శిబిరానికి హాజరయ్యారు. శిబిరానికి హాజరైన వారికి ఎముకల పటుత్వ సాంద్రత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సూర్యరశ్మి ద్వారా విటమిన్-బీ పొందవచ్చని డాక్టర్ సుమన్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

భార్యకు గాయాలు


ఓబయ్య మృతదేహం

బేస్తవారపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మొక్కు తీర్చుకునేందుకు సొంత గ్రామానికి బయలు దేరిన భార్యాభర్తలు ఊరు చేరకముందే ఆదివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో భర్త మృతి చెందగా, భార్యకు గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి మాజీ సైనికుడు సిరిగిరి ఓబయ్య (52) తానే కారు డ్రైవింగ్ చేసుకుంటూ సొంతూరు ఆదిమూర్తిపల్లెకు బయలుదేరారు. అనంతపురం-అమరావతి జాతీయ రహదారిలోని చింతలపాలెం వద్ద ఎదురుగా వస్తున్న లారీ కారు ఢీకొన్నాయి. దీంతో ఓబయ్య అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భార్య జ్యోతికి తీవ్ర గాయాలు కాగా కంభం ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలుకు రతలించారు. గిద్దలూరు మండలం ఆదిమూర్తిపల్లెకు చెందిన ఓబయ్య ఆర్మీలో రిటైర్డ్ అయిన తరువాత హైదరాబాద్ ఉప్పల్‌లో సెక్యూర్టీ గార్డ్‌గా పనిచేస్తూ నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. సొంతూరులో పోలేరమ్మకు మొక్కు తీర్చుకునేందుకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘట నా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోటా మృతికి సంతాపం

గిద్దలూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు కోటా శ్రీనివాసరావు మృతిపట్ల బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ రామాంజనేయులు ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. ఏ పాత్రలోనైనా ఇట్టే ఒదిగిపోయే బహుముఖ ప్రజ్ఞాశాలి అని, బీజేపీ నాయకుడిగా, ఎమ్మెల్యేగా సభకు గౌరవం తెచ్చారని, కోటా మృతి సినీరంగానికే కాకుండా పార్టీకి, రాష్ట్రానికి తీరనిలోటు అని పేర్కొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె

మార్కాపురం వన్‌టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఆదివారం సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రఫి మాట్లాడుతూ.. జీవో నెంబర్ 36 అమలు చేయాలన్నారు. రూ.21వేల వేతనం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, హరి, రఫి, సలాంఖాన్, కనకయ్య, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి సంరక్షించాలని జమాతే ఇస్లామి హింద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు తబాసుం అన్నారు. చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక చిన్నమసీద్ నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మట్టిలో చేతులు.. హృదయంలో దేశం నినాదంతో దేశవ్యాప్తంగా పిల్లలతో చెట్లు నాటించే కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో చిన్నారులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐవో, జీఐవో, మహిళా నాయకులు పాల్గొన్నారు.

గొలుసుకట్టు వ్యాపారంతో మోసపోవద్దు

ఎర్రగొండపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గొలుసుకట్టు వ్యాపారంలో రూపాయికి, రూపాయి వస్తుందని చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని సీఐ ప్రభాకరరావు తెలిపారు. ఎర్రగొండపాలెంలో ఒక వ్యక్తి గొలుసుకట్టు వ్యాపారం నిర్వహిస్తూ, గ్రామీణ ప్రజలకు ఆశలు రేకిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎక్కువ డబ్బులు వస్తాయని నమ్మి దానిలో పెట్టుబడిపెడితే అసలుకే మోసపోతారని అన్నారు. గొలుసు కట్టు వ్యాపారం చేసే వ్యక్తులపై నిఘా ఉంచామని తెలిపారు.

ఆపదలో ఉంటే 112కి ఫోన్ చేయండి

ఆపదలో ఉన్నప్పుడు రక్షణ కోసం 112 నెంబర్‌కు ఫోన్ చేసి సేవలు పొందాలని సీఐ ప్రభాకరరావు సూచించారు. ఫోన్ చేయగానే ఆపదలో ఉన్న స్థలానికి రక్షక్ పోలీసులు వెంటనే చేరుకొని మీకు రక్షణ కల్పిస్తారన్నారు. గొడవలు, రోడ్డు ప్రమాదాలు, బహిరంగ ప్రదేశాల్లో అనుమానిత వ్యక్తుల సంచారంపై సమాచారం ఉంటే వెంటనే 112కు ఫోన్ చేసి చెప్పాలన్నారు.

అపూర్వ కలయిక

మార్కాపురం వన్‌టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1986-87 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇటువంటి కార్యక్రమాల ద్వారా అందరిలో ఐకమత్యం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను వారు గుర్తుచేసుకున్నారు. తాము చదివిన పాఠశాల గదులను, కూర్చున్న స్థానాలను గుర్తు చేసుకుని ఆనందపడ్డారు. చిన్నప్పటి అల్లరి చేష్టలను గుర్తు చేసుకొని నవ్వుకున్నారు. కార్యక్రమంలో సీఐ సుబ్బారావు, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు గుంటక సుబ్బారెడ్డి, అన్నా రాము, లక్ష్మీనరసింహారావు, శ్రీనివాస మల్లికార్జున్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


పైపులైన్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కౌన్సిలర్ రమేష్

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ నదీ తీరాన వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామికి మాస కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు నరసింహాచార్యులు స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను శోభాయమానంగా అలంకరించారు. అనంతరం కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చెక్కా మాలకొండ నరసింహారావు, కోశాధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

మార్కాపురం వన్‌టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులలో వెలసియున్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజా సంక్షేమం..అమరావతి అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే నారాయణరెడ్డి

పొదిలి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమం, అమరావతి అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఈగలపాడు, గొల్లపల్లి, సూదనగుంట, రామాపురం, తుమ్మగుంట, అక్కచెరువు గ్రామాల్లో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు చెప్పిన సూపర్‌సిక్స్ పథకాలన్నీ ఒక్కొక్కటికీ అమలు చేస్తున్నారన్నారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వస్తుందన్నారు. పేదలైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ముందుగా ఈగలపాడులో ఎమ్మెల్యేకు సర్పంచ్ సుబ్బులు, యర్రారెడ్డి ఆధ్వర్యంలో టీడీపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. చిదంబరంపల్లిలో ఇటీవల అనారోగ్యానికి గురైన కార్యకర్త మాలపాటి నారాయణరెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గునుపూడి భాస్కర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఇమాంసాహెబ్, ఆవులూరి యలమంద, ఉలవా గోపి, రసూల్, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సామంతపూడి నాగేశ్వరరావు, తానికొండ వెంకట్రావు, రామాపురం కొండలు, ఈశ్వర్‌రెడ్డి, కాటూరి శ్రీను, గౌస్, పోపూరి నరేష్, ఒగ్గు వెంకటరామయ్య, సోమయ్య, ముని శ్రీను పాల్గొన్నారు.


రామాపురంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందుల

ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా నిలుద్దాం

పెద్ద దోర్నాల : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ మరోవైపు అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తు న్న ప్రజా ప్రభుత్వా నికి అందరం మద్దతు ఇద్దామని టీఎన్‌టీయూసీ ఒంగోలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య పిలుపునిచ్చా రు. మండలంలోని హసనాబాద్ గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఇంటింటికీ ఏడాదిలో అమలు చేసిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎలకపాటి చంచయ్య, బుస్సా నాగిరెడ్డి,ఒంటేరు రమణయ్య, గంగరాజు, చిన్నోడు, మరియబాబు, నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : 21 బూత్‌లో క్లస్టర్ నాయకులు తొలిఅడుగు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మల్లికార్జునరావు, సుబ్బారావు, షేక్ మస్తాన్ వలి, పూలసుబ్బయ్య పాల్గొన్నారు.


పథకాలను తెలియజేస్తున్న మల్లయ్య

గ్రామ గ్రామాన బీసీల జెండా ఎగరాలి

సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు

మార్కాపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీలను ఏర్పాటు చేసుకుని గ్రామ గ్రామాన ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జెండాలు ఎగరాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 139 కులాల బీసీ ప్రజలందరి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికిరణ్ మాట్లాడుతూ పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా మార్కాపురం నియోజకవర్గ అధ్యక్షులుగా బండారు రాజేష్‌ను ఎన్నుకుని నియామకపత్రాన్ని అందించారు. గౌరవాధ్యక్షుడిగా దూదేకుల మస్తానయ్య, ఉపాధ్యక్షుడిగా పి.మహేష్, ప్రధాన కార్యదర్శిగా డి.శంకర్, కోశాధికారిగా శివకృష్ణ, యువజన విభాగ కార్యదర్శిగా వి.శ్రీనివాస్, మహిళా విభాగ కార్యదర్శిగా గీతా భవాని, కార్యవర్గ సభ్యురాలిగా కొండమ్మతోపాటు ఆరుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, జిల్లా, నియోజకరవ్గ నాయకులు పాల్గొన్నారు.

11వ వార్డులో పైపులైన్ ఏర్పాటు

గిద్దలూరు టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 11వ వార్డులో తుప్పుపట్టిన పైపులైన్ స్థానంలో కొత్త పైపులైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. తుప్పుపట్టిన పైప్‌లైన్ నుంచి మురికి నీరు కొళాయి ద్వారా వస్తుండడంతో ఆప్రాంత ప్రజలు సమస్యను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి స్పందించి కొత్త పైపులైన్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గుండం నుంచి నటరాజ్ థియేటర్ వరకు ఇటీవలే పైప్‌లైన్ నిర్మించగా ప్రస్తుతం నటరాజ్ థియేటర్ నుంచి కుసమ హరనాథ్ మందిరం వరకు ఆదివారం నూతన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. కౌన్సిలర్ లొక్కు రమేష్ నూతన పైపులైన్ ఏర్పాట్లను పర్యవేక్షించగా వీధి మొత్తం నూతన పైపులైన్ ఏర్పాటు చేయించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి, కౌన్సిలర్ రమేష్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

రాచర్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆకవీడు గ్రామంలో ఆదివారం జరిగిన గంగమ్మ తిరుణాల కార్యక్రమంలో గిద్దలూరు టిడిపి నాయకులు ముత్తుముల కృష్ణకిశోర్ రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఆయనకు గ్రామ టిడిపి నాయకులు స్వాగతం పలికారు. అనంతరం కమిటీ సభ్యులు, పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అంబవరం శ్రీనివాసరెడ్డి, నంది శ్రీనివాసులు, ఉలాపు లింగన్న, గుముళ్ల అంకన్న, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : మండలంలోని కొమ్మునూరు పంచాయతీ పరిధిలో గల బ్రాహ్మణపల్లెలో రెండు రోజులుగా జరుగుతున్న పోలేరమ్మ తిరునాళ్ల వైభవంగా జరుగుతున్నది. ఆదివారం నాయకులు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి తిరునాళ్లలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోనే అభివృద్ధి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోనే అభివృద్ధి జరుగుతుందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు అన్నారు. మోదీ వికసిత్ భారత్ అమృత కాలం, సుపరిపాలన 11 ఏళ్లు నిండిన సందర్భంగా 20వ వార్డులో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచి ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధి పథకాలు వివరించారు. కార్యక్రమంలో ఎం.లక్ష్మీ, శ్రీకాంత్, ప్రవీణ్, రామకృష్ణ, వలి పాల్గొన్నారు.

బీజేపీ మండల నూతన అధ్యక్షురాలిగా మల్లీశ్వరి

పెద్ద దోర్నాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మండల నూతన అధ్యక్షురాలిగా సురవరం మల్లీశ్వరిని శనివారం ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు మాజీ మండల అధ్యక్షులు సురవరం గండి వీరారెడ్డి తెలిపారు. స్థానిక శివ సదనులో బీజేపీ జిల్లా అధ్యక్షులు సిగ్గెం శ్రీనివాసులు అధ్యక్షతన మల్లీశ్వరిని ఎంపిక చేసినట్లు ఆయన చెప్పారు. అనంతరం ఆమెను శాలువా కప్పి సత్కరించారు. మల్లీశ్వరి మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. తనను ఎంపిక చేసిన నాయకులకు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి రవిశంకర్, నియోజకవర్గ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, పిచ్చయ్య, నాగేశ్వరరావు, కాశీంపీరా పాల్గొన్నారు.

పొదలకొండపల్లె విద్యార్థిని స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

గిద్దలూరు టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొదలకొండపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న షేక్ రిహానా విద్యార్థిని నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైంది. గత సంవత్సరం రిహానా 8వ తరగతి చదువుతూ కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ పరీక్ష రాయగా ఫలితాలలో అర్హత సాధించింది. హిందీ ఉపాధ్యాయుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్య సహకారంతో ఉత్తీర్ణత సాధించారు.

అసంపూర్తిగా గ్రామ సచివాలయాలు

- గత వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణాలు
- నేటికీ పూర్తికాని వైనం
- అద్దె భవనాల్లో కార్యకలాపాలు
- చాలీచాలని వసతులతో సిబ్బంది అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ముండ్లమూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా చేపట్టిన గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు అసంపూర్తిగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో వీటిని ప్రారంభించారు. అయితే, ముండ్లమూరు మండలంలోని పలు గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్నాయి. ఆయా గ్రామాల్లోని కాంట్రాక్టర్లు కాంట్రాక్ట్ దక్కించుకొని గత ప్రభుత్వంలో నిర్మాణాలు మొదలుపెట్టారు. నాలుగు సంవత్సరాలు దాటినా నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. నిర్మాణాలు పూర్తిచేయకపోవడంతో పలుగ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, అద్దె భవనాల్లో సచివాలయాలు నడుస్తున్నాయి. ఒక్కో సచివాలయంలో 11 మంది సిబ్బంది, వారికి సంబంధించిన కంప్యూటర్లు ఉండాలి. ప్రభుత్వ భవనాలు నిర్మించక పోవటంతో అద్దె భవనాల్లో చాలిచాలనీ వసతులతో సిబ్బందితోపాటు వివిధ సమస్యలపై వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలోని పూరిమెట్ల, సింగనపాలెం గ్రామాల్లో రూ.35 లక్షల ఉపాధి నిధులతో సచివాలయాల భవనాలకు నిధులు మంజూరయ్యాయి. రైతు భరోసా భవనాలకు పోలవరం, సింగనపాలెం, శంకరాపురం, పసుపుగల్లు, పులిపాడులలో రూ.17 లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఆరోగ్య ఉప కేంద్రాల భవనాల కోసం పులిపాడు, సింగనపాలెం, పసుపుగల్లు, ఉమామహేశ్వర అగ్రహారంకు నిధులు మంజూరయ్యాయి. ఈ భవనాల నిర్మాణాల్లో ఇంకా 30 శాతం పనులు మిగిలి ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



అసంపూర్తిగా పూరిమెట్లలోని గ్రామ సచివాలయ భవన నిర్మాణం



అసంపూర్తిగా శంకరాపురంలోని రైతు సేవా కేంద్రం

విద్యుత్ అంతరాయాల తొలగింపునకు

కనిగిరిలో మరో సబ్‌స్టేషన్

- నేడు కనిగిరిలో శంకుస్థాపన
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 13(ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలను లేకుండా చేసేందుకు సబ్‌స్టేషన్ ఏర్పాటుచేస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక గార్లపేట రోడ్డులోని మోడల్‌స్కూల్ వద్ద ఏర్పాటుచేయనున్న 33/11కేవి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సోమవారం శంకుస్థాపన చేస్తున్నట్టు చెప్పారు. సంబంధిత స్థలంలో ఆదివారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఆయా పనులను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కనిగిరిలో విద్యుత్ వినియోగదారుల సంఖ్య పెరిగారన్నారు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లపై అధిక భారం పడి తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. లోఓల్టేజీ సమస్యతోనూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

గార్లపేట రోడ్డులో ఎక్కువగా మైనింగ్ క్వారీలు ఉండటంతో అదనపు లోడుతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్‌లు అవసరమని గుర్తించినట్టు చెప్పారు. అందులోభాగంగా రూ.3.80 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రాష్ట్ర విద్యుత్‌శాఖ మంతి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తొలగిపోనున్నాయన్నారు.

కార్యక్రమంలో తహసీల్దార్ రవిశంకర్ డీఈ ఉమాకాంత్, ఏఈ పవన్‌కుమార్, జంపీర్, గాయం తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ శంకుస్థాపనకు జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య

దర్శి, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అన్నారు. దర్శి పట్టణంలోని 9వ వార్డులో ఆదివారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. అన్నిరకాల పథకాలు అందుతున్నాయా, లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా చైర్మన్ పిచ్చయ్య మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలను వరుసగా అమలుచేస్తున్నట్టు చెప్పారు. కొద్దిరోజుల్లో అన్నదాత సుఖీభవ పథకం, ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్ సౌకర్యం ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తుండటంతో అన్నివర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. వైసీపీ నాయకులకు ఏమి చేయాలో దిక్కుతోచక రెచ్చగొట్టే వైఖరి అవలంబిస్తూ గొడవలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ నాయకులు తమ ప్రవర్తన మార్చుకోకుంటే వచ్చే ఎన్నికల్లో ఆ పదకొండు సీట్లు కూడా రావన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, నాయకులు శ్రీనాథ్, శ్రీనివాసరావు, విజయకృష్ణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య, తదితరులు

శిథిలావస్థలో రేగిచెట్లపల్లి పశువైద్యశాల

- డాక్టరులేక ఆరేళ్లుగా మూత
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న పశుపోషకులు

పామూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): పామూరు ప్రాంతంలో ఎక్కువగా పాడిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే, మూగజీవాలు అనారోగ్యం పాలైనప్పుడు వైద్యం కోసం పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో పామూరు, రేగిచెట్లపల్లిలో పశువైద్యశాలలు ఉన్నాయి. లక్ష్మీనరసాపురం గ్రామ పంచాయతి పరిధిలోని రేగిచెట్లపల్లి గ్రామంలో 1997లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి పథకం కింద రూ. లక్షా యాభైవేలతో పశువైద్యశాలను నిర్మించారు. అప్పటినుంచి 11 గ్రామ పంచాయతీలకు చెందిన పశుపోషకులు ఈఆస్పత్రిలో తమ జీవాలకు వైద్యసేవలు పొందుతున్నారు. అయితే, గత ఆరేళ్లుగా ఇక్కడ వైద్యసేవలు అందడంలేదు. డాక్టర్లను, సిబ్బందిని నియమించకపోవడంతో వైద్యశాల మూతపడింది. ఆయ గ్రామ పంచాయతిల్లో 7 వేలకు పైగా గేదెలు, 20 వేలకు పైగా గొర్రెలు, మేకలు ఉన్నాయి. ప్రస్తుతం ఈఆస్పత్రి నిరుపయోగంగా మారింది. ఆవరణలో పిచ్చి మొక్కలు మొలచి విషపురుగులకు నిలయంగా తయారైంది. భవనం పెచ్చులూడుతు శిథిలావస్థకు చేరింది. ఇక్కడ వైద్యసేవలు లేకపోవడంతో పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ భవనాన్ని మరమ్మతులు చేయించి, సిబ్బందిని నియమించి వినియోగంలోకి తీసుకురావాలని పశుపోషకులు కోరుతున్నారు.



మూతపడిన పశువైద్యశాల

డాక్టర్‌ను నియమించాలి


- ఇక్కుర్తి రామిరెడ్డి, రేగిచెట్లపల్లి



రేగిచెట్లపల్లి పశువైద్యశాలలో డాక్టరు లేక మూతపడింది. దాంతో తమ జీవాలకు జబ్బుచేస్తే పది కిలోమీటర్ల దూరంలోని పామూరుకు వెళ్లాల్సి వస్తుంది. వ్యయప్రయాసాలతో జీవాలను తీసుకెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వస్తుంది. పాలకులు స్పందించి డాక్టర్‌ను, సిబ్బందిని నియమించి వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలి.

పశువైద్యశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలి

- ముసునూరు సుబ్బమ్మ, రేగిచెట్లపల్లి



తమ కుటుంబానికి 20 వరకు గేదెలు ఉన్నాయి తమ కుటుంబం పాలపోషణపై ఆధారిపడి జీవిస్తున్నది. అత్యవరసర సమయాల్లో వైద్యం కోసం ప్రైవేట్ వ్యక్తులపై ఆధారపడాల్సి వస్తుంది. వైద్యశాలలో వసతులు కల్పించి డాక్టర్ నియమించాలి.



చిట్టడవిలా పశువైద్యశాల ప్రాంగణం

ముఖాముఖి

పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

హనుమంతరావు, ఎంపీడీవో, పీసీపల్లి



ప్రశ్న: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది కదా?

జవాబు: పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ప్రతిరోజు గ్రామాలను సందర్శించి సిబ్బందికి తగు సూచనలు చేస్తున్నాం. మురుగ కాలువల్లో పూడిక తీయిస్తున్నాం.

ప్ర: ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా?

జ: అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. సాంకేతిక కారణాలతో లబ్ధి పొందలేకపోయిన వారిని గుర్తించి అందేలా చూస్తున్నాం.

ప్ర: చేతిపంపులు మరమ్మతులకు గురయ్యాయి కదా?

జ: మరమ్మతులకు గురైన చేతిపంపులను గుర్తిస్తున్నాం. ఒక్కొక్కటిగా మరమ్మతులుచేసి వినియోగంలోకి తీసుకొస్తున్నాం.

ప్ర: పశువుల నీటితొట్లు ఎన్ని మంజూరయ్యాయి?ఎన్ని నిర్మించారు?

జ: మండలానికి 55పశువుల నీటితొట్లు మంజూరయ్యాయి. ఉపాధి హామీ నిధులతో 55 నిర్మాణాలు పూర్తయ్యాయి.

ప్ర: పశువుల షెడ్‌లు ఎన్ని మంజూరయ్యాయి?

జ: మండలంలో 21పశువుల షెడ్‌లు మంజూరయ్యాయి. వాటిలో 16 పూర్తవగా ఐదు వివిధ దశలలో ఉన్నాయి.

నేడు కురిచేడుకు ఇద్దరు మంత్రుల రాక

కురిచేడు, జూలై 13(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలంలో సోమవారం జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొంటున్నారు. మండలంలోని కల్లూరు గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన, కురిచేడు నుంచి నమశ్శివాయపురం రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. ఈకార్యక్రమాలను జయప్రదం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ పితల నెమిలయ్య పేర్కొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

సీఎస్‌పురం(పామూరు), జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో వచ్చే నెలలో జరగనున్న సీపీఐ 28 వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆపార్టీ మండల కార్యదర్శి ఎస్‌కే పెద్దమస్తాన్ పేర్కొన్నారు. మండలంలోని పిల్లిపల్లె గ్రామంలో ఆదివారం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈప్రాంతంలో ఎక్కువమంది జీవనోపాధిలేక వలస వెళుతున్నారన్నారు. ఇక్కడ అటవీ భూములు విస్తారంగా ఉన్నాయన్నారు. అటవీ హక్కుల ప్రకారం ఎస్టీలకు భూములు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జె.తిరుపతయ్య, ఎస్‌కే మౌలాలి, జె.అల్లూరయ్య తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

తాళ్లూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న తూర్పుగంగవరం పంచాయతీలోని సోమవరప్పాడు పరిధిలోగల గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. తాళ్లూరు ప్రాంతంతో పాటు వివిధ ప్రాంతాలనుంచి మొక్కలు తీర్చుకునేందుకు రావటంతో భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. గంగమ్మ తల్లిని దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామ పూజలు చేశారు. పూజారులు ప్రకాశ్‌పంతులు, విజయలక్ష్మి, బాలరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, దేవదాయశాఖ ఈవో జి.వాసుబాబు, ఆర్‌ఏ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అచ్చమాంబకు పొంగళ్లు

పామూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘునాథపురం, కొత్తపల్లి గ్రామాల మధ్య వెలసి ఉన్న శ్రీఅచ్చమాంబ నెల పొంగళ్లను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు కొల్లు రవికిరణ్ కుమార్ శర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన విశేష పూజలు నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరణ చేశారు. ఈసందర్భంగా ఆలయ ధర్మకర్త అడుసుమల్లి చెంచయ్య, దేవస్థాన కమిటీ అధ్యక్షుడు అడుసుమల్లి నరసింహులు అమ్మవారికి చీరసారెను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పసుపు కుంకుమతో పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో పల్లకిసేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో దుద్దుకూరు మల్లికార్జున, గుర్రం నాగేంద్ర, గుంజి మహాలక్ష్మయ్య, అడుసుమల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివారం పూజలు



మహానైవేద్యం తీసుకువస్తున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు), జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళా లతో ఆలయ గాలి గోపురం వద్ద నుంచి మహానైవేద్యాన్ని ఆలయ ప్రదక్షిణచేసి స్వామి వారికి సమర్పించారు. ఆలయ ప్రాంగణంలోని గోశాలలో ఉన్న గోమాతలకు పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించారు. తదనం తరం అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు



ఈదర గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ కమలాకర్

ముండ్లమూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ కె.కమలాకర్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ఈదర గ్రామాన్ని సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రశాంతతకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఎవరైనా గొడవలకు పాల్పడి శాంతి భద్రతలు విఘాతం కలిగిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. కొత్త వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తుంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

పామూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని సింగిల్‌విండో మాజీ చైర్మన్ బైరెడ్డి జయరామిరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని వగ్గంపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవనబోయిన సుబ్బయ్య, చావా సుబ్బయ్య, బైరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని జిల్లా ముస్లిం మైనార్టీసెల్ కార్యదర్శి ఆర్‌ఆర్ రఫి అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి ఏడాది కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో షేక్ ఖాజారహంతుల్లా, షేక్ హాజీగౌస్, ముబీనా మౌలాలి, గౌస్ బాషా, మాచర్ల రహిమాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ ప్రభుత్వ ఫలాలు



ఉమామహేశ్వర అగ్రహారంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కూరపాటి శ్రీనివాసరావు, తదితరులు

ముండ్లమూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలందరికీ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవినేని కోటేశ్వరరావు, కాటూరి గురవయ్య, కాటూరి వెంకటరావు, కంచుమాటి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ముండ్లమూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పోలేరమ్మ అమ్మవారికి భక్తులు పొంగళ్ళు పెట్టి నైవేద్యాన్ని సమర్పించారు. ముండ్లమూరు, పోలవరం, నూజెండ్లపల్లి, బొప్పూడివారిపాలెం, పసుపుగల్లు గ్రామాల్లో ఉన్న పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.





విద్యానగర్‌లో అధ్వానంగా ఉన్న రోడ్డు

ఎన్నికలే.. పరిష్కార మార్గం



బాపట్ల పురపాలక సంఘ కార్యాలయం

- అధ్వానంగా బాపట్ల పురపాలక సంఘం ఆర్థిక స్థితి
- అభివృద్ధి పనులకు నిధుల కొరత.. ఆదాయంపై అన్వేషణ
- పాలక మండలి ఏర్పడితేనే.. ఆర్థిక సంఘం నిధుల జత

బాపట్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పురపాలక సంఘం ఆర్థిక పరిస్థితి అధ్వానంగా మారింది. వైసీపీ పాలనలో పురపాలక సంఘాన్ని నిర్వీర్యం చేశారు. 34 వార్డులు ఉన్న బాపట్ల మునిసిపాలిటీలో మరో 8 గ్రామ పంచాయతీలను విలీనం చేసి.. ఎన్నికలు నిర్వహించాలని చూశారు. దీనిని కొందరు ఆక్షేపిస్తూ కోర్టును ఆశ్రయించడంతో ఎన్నికలు నిలిచిపోయాయి. 15వ ఆర్థిక సంఘం నిధులనూ కేంద్రం నిలిపివేసింది. ఫలితంగా రూ.3కోట్లకు పైగా నిధులు ఆగిపోయాయి. దీంతో అభివృద్ధి పనులకు నిధుల కొరత ఏర్పడింది. రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణం.. కనీసం వీధి దీపాలు మరమ్మతులు చేయాలన్న నిధులు లేక అధికారులు మిన్నకుండిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కాలంటే.. బాపట్ల మునిసిపాలిటీకి ఎన్నికలు తప్పనిసరి. దీనికోసం స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో పాటు కూటమి నాయకులూ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికలు జరిగితేనే ఆర్థిక సంఘం నిధులు వస్తాయి. ఆ తర్వాత అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా ముందుకెళ్లవచ్చు.

గుత్తేదారులకు నిలిచిపోయిన బకాయిలు

వైసీపీ పాలనలో నిధులు లేకపోయినా కాంట్రాక్టర్లను నమ్మించి, ఒప్పించి అనేక అభివృద్ధి పనులు చేయించారు. అందులో ముఖ్యంగా కర్లపాలెం రోడ్డు నుంచి విద్యానగర్‌లో హైవే లింకు రోడ్డు ఒకటి. ఇక్కడ బీటీ రోడ్డు నిర్మాణానికి అనేక కుటుంబాలను ఖాళీ చేయించారు. కాంట్రాక్టర్ రోడ్డు విస్తరించి.. మెటల్ వేసి డివైడర్ ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేసి వెళ్లిపోయాడు. అదేవిధంగా ఉప్పరపాలెం నుంచి జీబీసీ రోడ్డును కలుపుతూ రైల్వే ట్రాక్ పక్కనే రోడ్డు పనులు ప్రారంభించారు. దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో అక్కడ పనులు కూడా నిలిచిపోయాయి. ఫలితంగా కాంట్రాక్టర్‌కు బిల్లులు రాలేదు. ఈ విధంగా చెప్పుకుంటూ పోతే గత పాలకులు చేసిన తప్పిదాల వల్ల కాంట్రాక్టర్లకు రూ.15 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పురపాలక సంఘం సాధారణ నిధులు నుంచి కొద్దిపాటి బిల్లులు చెల్లిస్తున్నప్పటికీ.. ఇంకా బకాయిలు మిగిలే ఉన్నాయి.

ఆదాయంపై అధికారుల దృష్టి

పురపాలక సంఘం ఆదాయం పెంపుదలపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పన్ను వసూళ్లు, కొత్త నిర్మాణాలకు పన్ను వేయడం ద్వారా ఆదాయం రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇంత చేసినా రూ. 1.50 కోట్లు మాత్రమే ఆదాయం పెరిగే అవకాశం ఉంది. పన్ను చెల్లించేవారు మొత్తంగా ముందుకు రాకపోతే అదికూడా సాధ్యపడదు. పురపాలక సంఘం ఎన్నికలు జరిగి.. పాలక మండలి ఏర్పడితేనే ఆర్థిక సంఘం నిధులు వచ్చి సాధారణ నిధులతో కలిస్తే అభివృద్ధి జరుగుతుంది. దీనిపై పాలకులు, అధికారులు దృష్టి సారిస్తేనే బాపట్ల పట్టణ సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది.

రుణ పరిమితి పెంపు

సాగు వ్యయం పెరిగిపోతోంది. కూలి నుంచి విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వరకు ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. వ్యవసాయ రుణాలు ఖర్చులకు అనుగుణంగా లేవు. అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో రుణ పరిమితి పెంచాలని రైతులు అభ్యర్థిస్తున్నారు. వారి వినతులపై స్పందించిన ప్రభుత్వం రుణ పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఖరీఫ్, రబీ రెండు సీజన్లకు పంటల వారీగా రుణాలను నిర్ణయిస్తూ బ్యాంకర్లకు ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. తమ గోడు పాలకులు పట్టించుకుని రుణాల పెంపుదలతో అప్పుల తిప్పలు తప్పాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





- ఖరీఫ్, రబీ సీజన్లకు వర్తింపు
- రైతుల అభ్యర్థనకు ప్రభుత్వం స్పందన
- పంటల వారీగా రుణాలపై బ్యాంకర్ల ఆదేశాలు
- అప్పుల బాధలు తప్పాయని అన్నదాతల ఆనందం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ సమీపించిన తరుణంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో బ్యాంకులు వార్షిక పద్దును ప్రకటించాయి. అయితే రుణ పరిమితి పెంచితే తమకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అభ్యర్థించగా ప్రభుత్వం వారి గోడు ఆలకించి ఈ ఆర్థిక సంవత్సరంలో సేద్యానికి అందించే రుణాల విషయంలో పరిమితి పెంచింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంపు నిర్ణయం ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో వర్తింప చేయాలని ఆదేశించింది. ఈ ఆదేశాలను బ్యాంకులతో పాటు సహకార సంఘాలు కూడా పాటించాలని ప్రభుత్వం సూచించింది. వరికి సంబంధించి ఎకరా సాగుకు రుణ పరిమితి 46,000 ఉండగా దానిని ఖరీఫ్‌లో 52,000, రబీలో 55,000 వరకు పెంచింది. దీంతో పెట్టుబడి ఖర్చుల్లో సగటున రూ.7000 వరకు రుణం పెరగనున్నది. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో నాలుగు లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. వర్ష ఆధారిత పొలాల్లో పత్తి విషయంలో గత ఆర్థిక సంవత్సరం రూ.46,000లు ఉండగా, దానిని రూ.51,000కు పెంచుతూ ప్రభుత్వ సూచన మేరకు బ్యాంకులు నిర్ణయం తీసుకున్నాయి. మిర్చి సాగుకు రుణ పరిమితి పెంపు నిర్ణయంతో దాదాపు లక్షన్నర మంది రైతులకు మూడు జిల్లాల పరిధిలో మేలు జరగనున్నది. ఉద్యాన పంటల సాగుకు కూడా రుణ పరిమితి పెంచారు. మొక్కజొన్న, కంది, శనగ, మినుము ఇలా దాదాపు ప్రతీ పంటకు రుణ పరిమితి పెంపు నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంట(ఎకరా)	గతం	ప్రస్తుతం
వరి	46,000	52,000
పత్తి	48,000	55,000
పత్తి(వర్షాధారం)	46,000	51,000
మిర్చి	1,50,000	1,75,000
పచ్చిమిర్చి	90,000	1,10,000
అరటి	99,000	1,10,000

కొర్రీలు వద్దు.. ఉదారంగా వ్యవహరించాలి

వార్షిక పద్దులో వ్యవసాయానికి కేటాయించిన రుణాలలో ప్రతి పైసా రైతులకు చేరాలని బ్యాంకర్లకు ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయ రుణాల విషయంలో రకరకాల నిబంధనలతో కొర్రీలు వేసే కార్యక్రమాలకు స్వస్తి పలకాలని, సాధ్యమైనంత వరకు ఉదారంగా వ్యవహరించి రైతుల ప్రయోజనాలు కాపాడాలని సూచించింది. రుణాల పెంపు లేకపోగా సర్దుబాటుతోనే గతంలో ముగించేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి ఉండడానికి వీల్లేదని ప్రభుత్వం బ్యాంకులకు సూచించింది.

కుప్పడం చీరకు...
నేడే సత్కారం

- సాకారమైన చీరాల చేనేతల చిరకాల స్వప్నం
- ఢిల్లీలో అవార్డు అందుకోనున్న కలెక్టర్ వెంకటమురళి

చీరాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మహిళలకు గౌరవాన్ని దర్పాన్ని అందిస్తూ జాతీయ స్థాయి గుర్తింపు పొందిన చీరాల కుప్పడం చీర ఢిల్లీ వేదికగా సోమవారం సత్కారం అందుకోనున్నది. ఈ ఏడాది జనవరిలో చీరాలలో పర్యటించిన కేంద్ర బృందం కుప్పడం చీర ప్రాముఖ్యతను పరిశీలించింది. దీంతో కుప్పడం చీరకు కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయి గుర్తింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి ఢిల్లీలో కలెక్టర్ వెంకటమురళి అవార్డు అందుకోనున్నారు. చిరకాల స్వప్నం సాకారం కావడంతో చీరాలకు చెందిన నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మగ్గంపై చీరను తయారు చేస్తున్న కార్మికుడు



కుప్పడానికి ప్రత్యేక స్థానం..

నేత చీరల తయారీలో చీరాల చేనేతలకు ప్రత్యేక స్థానం ఉంది. ఎన్నిరకాల సంక్షోభాలు ఎదురైనా వాటిని అధిగమించి చేనేతకు చీరాల గుర్తింపు తెచ్చుకుంది. దేశంలో వివిధ ప్రాంతాల్లో కుప్పడం తయారవుతున్నా 5 అంగుళాల చీరలు మాత్రమే మార్కెట్లో ఉన్నాయి. ఆ సమయంలో చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలేనికి చెందిన చేనేత కార్మికుడు కూరపాటి సుబ్బారావు 20 ఏళ్ల క్రితం గద్వాల్‌కు కార్మికులను తీసుకెళ్లి కుప్పడం చీర నేతపై శిక్షణ ఇప్పించారు. ఆ తర్వాత అన్ని దగ్గర్ల చేసినట్లు 5 అంగుళాలతో కుప్పడం చీర తయారీ ఇక్కడ కూడా చేపట్టారు. ప్రస్తుతం 18 అంగుళాల బోర్డర్‌తో కుప్పడం చీరలు తయారు చేసేలా ఇక్కడి నేతన్నలు నైపుణ్యం సాధించారు. ప్రస్తుతం 5 వేల మగ్గాలు చీరాల పరిధిలో ఉన్నా వీరిలో రెండు వేల మంది మాత్రమే కుప్పడం తయారీ చేసే పరిస్థితి ఉంది. తొలుత కుప్పడం చీర సంక్షోభంలో చిక్కుకోగా జాండ్రపేటకు చెందిన సిద్ధి సత్యన్నారాయణ వెలుగులోకి తెచ్చారు. తాజాగా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కుప్పడం చీర విశిష్టతను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పాటు జౌళిశాఖ మంత్రి సవిత దృష్టికి తీసుకు తీసుకెళ్లారు. వారు చీర నాణ్యత, నేతన్నల శ్రమను గుర్తించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంతో జాతీయ స్థాయి గుర్తింపు పొందింది.

కుప్పడం ప్రత్యేకతలు ఇవి

చీరాల కుప్పడంలో 5 నుంచి 18 అంగుళాల అంచుతో చీర తయారు చేస్తున్నారు. నేతలోనే బోర్డరు కలిసి ఉండటంతో ప్రత్యేకత సంతరించుకుంది. నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా ఉంటూ మహిళలను ఈ చీరలు ఆకర్షిస్తున్నాయి.

ప్రత్యేక శిక్షణతో అభివృద్ధి

చీరాలలో కార్మికులు అధికంగానే ఉన్నారు. ప్రత్యేకంగా కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తే అత్యాధునిక డిజైన్లు తయారు చేసేందుకు అవకాశం ఉంటుంది. బ్యాంకులు రుణ సాయం ఉండాలి. ఆధునిక యంత్రాల అవసరం కూడా ఉంది.

-సిద్ధి బుచ్చేశ్వరరావు, మాస్టర్ వీవర్

కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి : సీఐటీయూ

బాపట్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సి.హెచ్. మజుందార్ అన్నారు. సమ్మెబాట పట్టిన కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించారు. సమ్మె శిబిరం వద్ద మజుందార్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు విధులలోకి హాజరయ్యేది లేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. తాగునీరు, విద్యుత్ వంటి విధులకు విఘాతం కలిగి ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున సమ్మె ఉధృతంకాక ముందే పర్కిరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకుడు కె.శరత్, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ నాయకులు రత్నం, నాని, అశోక్, మురళికృష్ణ, హరిబాబు, వెంకటేశ్వరరెడ్డి, సాంబిరెడ్డి,ప్రమీలా, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, కాల్వలు.. అధ్వానం

- అవస్థలు పడుతున్న జగనన్నకాలనీవాసులు



18వ వార్డు జగనన్న కాలనీలో బురదమయంగా రోడ్డు

రేపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 18వవార్డులో అరవై ఎకరాల్లో గత ప్రభుత్వంలో లేఅవుట్ వేశారు.. 2134 ఇళ్లు మంజూరు చేశారు.. 1300 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు.. అయితే ఇక్కడ రోడ్లు వేయలేదు. డ్రెయిన్లు నిర్మించలేదు. దీంతో జగనన్న కాలనీలో కనీస సౌకర్యాలు కల్పనలో అప్పటి జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఓ మోస్తరు వర్షానికి రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. రాకపోకలకు కాలనీవాసులు అల్లాడుతున్నారు. డ్రెయినేజీలు అధ్వానంగా ఉన్నాయి. గృహాల చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి దోమలకు ఆవాసాలుగా మారాయి. ఇటీవల కురిసిన వర్షానికి ఖాళీ ప్లాట్లలో, రోడ్లపై నీరు నిలిచిపోయింది. మురుగునీరు పారుదల పెద్దసమస్యగా మారింది. కొన్ని ఇళ్లకు మాత్రమే తాగునీటి కుళాయిలు ఉన్నాయి. మిగిలిన వారు తాగునీటిని వాటర్ ప్లాంట్లు ద్వారా కొనుగోలు చేసుకుని తెచ్చుకోవాల్సి వస్తోంది. ప్రణాళిక లేకుండా చేపట్టిన నిర్మాణాలతో అల్లాడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.



అధ్వానంగా మారిన డ్రెయిన్

ఎత్తిపోతలు.. నిరుపయోగం

- మరమ్మతులకు నోచుకోని పథకాలు
- గుండ్లకమ్మలో నీరున్నా బీళ్లుగా పొలాలు

అద్దంకి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం గుండ్లకమ్మ నిండుకుండలా ఉంది. అయినా సాగునీటి కోసం రైతులకు కష్టాలు తప్పడంలేదు. ఎత్తిపోతల పథకాల మరమ్మతుల గురించి పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో రైతులకు సాగునీరు అందక పొలాలను బీళ్లు మార్చేసుకున్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ వైసీపీ హయాంలో గేట్లు కొట్టుకుపోయాయి. దీంతో అప్పటి నుంచి ఎత్తిపోతల పథకాలు మూలనపడ్డాయి. దీంతో అవి మరమ్మతులకు గురయ్యాయి. నిరుపయోగంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గత ఏడాది గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు బిగించింది. దీంతో మండు వేసవిలో కూడా ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉంది. అయితే ఎత్తిపోతల పథకాలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో గుండ్లకమ్మ నీరు రైతులకు ఉపయోగపడటంలేదు. అద్దంకి మండలం పార్వతీపురంలోని శ్రీసత్యసాయి ఎత్తిపోతల పథకం మూడేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. నెల క్రితం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు పగలకొట్టడంతో తిమ్మాయపాలెం ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారింది. శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం తరచూ మరమ్మతులకు గురవుతుంది. మూడు ఎత్తిపోతల పథకాలకు తక్షణ మరమ్మతులు చేపట్టకపోతే ఈ ఏడాది కూడా 5 వేల ఎకరాలు ఆయకట్టులో సాగుకు నీటి విడుదల ఉండదని, రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఖాళీగా ఉన్న పార్వతీపురం ఆయకట్టులోని పొలాలు



ఎత్తిపోతల జరగని తిమ్మాయపాలెం పథకం

అవీ..ఇవీ..

రోటరీ సేవలు విస్తరించాలి

● ఘనంగా నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవం



నూతన కార్యవర్గంతో డాక్టర్ ఎస్వీ రాంప్రసాద్, తదితరులు

అద్దంకిటౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ గత కార్యవర్గం సేవా కార్యక్రమాలు చేయడంలో జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచిందని, గతం కంటే నూతన కార్యవర్గం ఎక్కువ సేవా కార్యక్రమాలు రోటరీ ద్వారా అందించాలని రోటరీ 3150 డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ ఎస్వి రాంప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక వాసవి కల్యాణ మండపంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, అద్దంకి 2025-26 నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం మాజీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా రాంప్రసాద్, నూతనకమిటి సభ్యులు సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం హరిహర గోకులం ఆవరణలో మన్నం త్రిమూర్తులు సహకారంలో పండ్లమొక్కలు నాటారు. అనంతరం కల్యాణ మండపంలో నూతన కార్యవర్గం సభ్యులు అధ్యక్షుడుగా బాచిన శశిధర పూర్ణచంద్రరావు, కార్యదర్శిగా ఆళహరి హరిప్రసాద్, కోశాధికారిగా చామర్తి వెంకట గురుశేఖర్, తదితర సభ్యులతో డిస్ట్రిక్ గవర్నర్ రాంప్రసాద్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రోటేరియన్ కాకర్ల వెంకటేశ్వర్లు ఆర్థిక సహకారంతో నాగన్నపాలెం గ్రామ షిరిడి సాయి సహకారం సంస్థకు రూ.25 వేల విలువైన కుట్టు మిషన్‌ను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ సహాయక గవర్నర్ రావి అంకమ్మ చౌదరి, డిస్ట్రిక్ సెక్రటరీ కొల్లా సింగారావు, చుండూరి మురళి సుధాకరరావు, మలాది శ్రీనివాసరావు, వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య), షేక్ మహమ్మద్ రఫీ, పి. ఉదయబాస్కర్, డాక్టర్ చదలవాడ ఫణీంద్రబాబు, సందిరెడ్డి శ్రీనివాసరావు, మురళికృష్ణ, లేవి ప్రసాద్, నరసింహరావు , దేవపాలన, చంద్రమౌళి, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపాలెం గ్రామదేవతకు పొంగళ్లు

ఇంకొల్లు,జూలై 13,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు శివారు గొల్లపాలెం గ్రామంలో ఆదివారం గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. గామంలోని భక్తులు ఊరేగింపుతో దేవాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

చీరాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలో వివిధ రంగాల్లో వ్యాపారాలు కొనసాగిస్తున్న ప్రతినిధులు జీఎస్టీపై కచ్చితమైన అవగాహన పొందడం ద్వారా ప్రయోజనాలు పొందుతారని చీరాల ఆదాయపు పన్ను అధికారి గ్రంధి మురళీకృష్ణ, రాష్ట్ర జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రాయవరపు శ్రీనివాసరావు, చీరాల సెంట్రల్ జీఎస్టీ సూపరిండెంట్ వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌వీఎస్ ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో ఆదాయపు పన్ను -2025, జీఎస్టీపై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ), చీరాల చాంబర్ ఆఫ్ కామర్స్, ఎస్ఐఆర్‌సీ ఒంగోలు బ్రాంచి సంయుక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీఎస్టీ చెల్లింపులు, టాక్స్, అడ్వాన్స్‌టాక్స్‌ల ప్రయోజ నాలను వివరించారు. కార్యక్రమంలో ఒంగోలు బ్రాంచి చైర్మన్ చక్కా తిరువాయ్ కుమార్, స్పీకర్స్ సుధీర్, రాజేష్, వల్లంపట్ల వెంకటేశ్వరరావు, చిన్ని లీలాధరరావు, వేముల చంద్రశేఖర్‌రావు, పలువురు ఆడిటర్స్, ప్రముఖ వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీకొని ఇరువురికి గాయాలు

బల్లికురవ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రెండు బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని అంబడిపూడి-కొమ్మినేనివారిపాలెం గ్రామాల మధ్య చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో కొమ్మినేనివారిపాలేనికి చెందిన కాకుమాను అరుణ్‌కుమార్, సోమవరప్పాడుకు చెందిన పుసులైరి శ్రీనివాసరావులకు గాయాలయ్యాయి.

ఆధ్యాత్మిక చింతనతో సంతోషకరమైన జీవనం

ఎమ్మెల్యే కొండయ్య



సత్యసాయి చిత్రపటాన్ని అందుకుంటున్న ఎమ్మెల్యే

చీరాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనతో జీవన గమనం సాగించాలని, తద్వారా ఆనందంగా ఉంటారని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. ఆదివారం రామాపురం సముద్రతీరంలో శ్రీసత్యసాయి బాబా శతజయంతి సందర్భంగా నిర్వహించిన విశ్వమానవాళి శాంతపూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏకాదశ రుద్ర పారాయణం (రుద్రోపాసన) నిర్వహించారు. సత్యసాయి సేవాసంస్థలు, వేదాధ్యాయన విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవాభావంతోనే బాబాసూక్తులు చేశారన్నారు., ఆయన సేవలు సమాజంపై కలిగించిన ప్రభావం విశేషమని చెప్పారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు సురేంద్ర, జిల్లా అధ్యక్షులు రాంబాబు, సమన్వయకర్తలు ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఇటీవల వైద్యసేవలు పొంది అర్జీ చేసుకున్న 46 మందికి రూ.40.06 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సేవలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. ఈక్రమంలోనే ప్రభుత్వ వైద్యశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు రఘుప్రసాద్

బల్లికురవ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఉచిత మెగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని నర్సారావుపేటకు తేజ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ బొట్ల రఘుప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం బల్లికురవ ఉన్నత పాఠశాల ఆవరణలో తేజ నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. బల్లికురవ. నక్క బొక్కలపాడు, కొత్తపాలెం, గుంటుపల్లి, కొణిదెన, తదితర గ్రామాలకు చెందిన 400 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎముకలు, కీళ్ల నరాల వైద్య నిపుణులు డాక్టర్ రఘుప్రసాద్, జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ బొట్ల రంగతేజ, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ బొట్ల పార్వతి, మరియు కంటి వైద్యులు ప్రజలకు పరీక్షలు నిర్వహించారు. రోగులకు రూ.1.50 లక్షల విలువైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు షుగర్, రక్త పరీక్షలను క్యాంప్ వద్దే ల్యాబ్ ఏర్పాటు చేసి వారికి అవసరమైన వైద్య సేవల ను అందించారు. ఈసందర్భంగా వైద్యశాల అధినేత రఘు ప్రసాద్ మాట్లాడుతు ప్రజలు పలు రకాల జబ్బుల బారిన పడుతూ తీవ్ర ఇబ్బంది పడుతున్నార న్నారు. ఈ మెగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తే వారి బాధలు కొంత వరకు తీర్చే అవకాశం ఉంటుందన్నారు.

వైభవంగా గంగమ్మ కొలుపులు



అమ్మవారికి పొంగళ్లు సమర్పించేందుకు వెళుతున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

చినగంజాం, జూలై 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో గంగమ్మ కొలుపులు ఆదివారం వైభవంగా ముగిశాయి. గ్రామంలో శుక్రవారం నుంచి అమ్మవారికి పలు రకాల పూజలు నిర్వహిస్తూ, ఆదివారం పొంగళ్ల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై విద్యుత్ దీపాలతో అలంకరించిన అమ్మవారి ప్రభను ఉంచి డప్పు కళాకారుల నృత్యాల నడుమ గ్రామంలోని పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. గంగమ్మ అమ్మవారి ప్రభ ముందు, అమ్మవారి ఉత్సవ విగ్రహంతో, భక్తులు బొల్లి ఎద్దుల విగ్రహాలతో ఊరేగింపుగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఆదివారం సాయంత్రం అమ్మవారి ఆలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి హైమారావు అమ్మ వారికి విశేష పూజలు చేశారు. మహిళలు అమ్మ వారికి పొంగళ్లను నైవేద్యంగా చెల్లించి, మొక్కులు తీర్చుకున్నారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు. అమ్మవారి ఆలయాన్ని రంగు, రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. ఆలయ ప్రాంగణంలో విద్యుత్ దీపాలతో అమ్మవార్ల కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాపులు కొండెపు వెంకటేశ్వర్లు, నక్కల పెదముత్తయ్య, యాదవ పెద్దలు, శ్రీకృష్ణా యాదవ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

700 మందికి కంటి వైద్యపరీక్షలు

భారీగా తరలి వచ్చిన రోగులు



ఓపీ రాయించుకుంటున్న వైద్యులు

పర్చూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహకారంతో గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్చూరులోని వైఆర్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. పెద్దఎత్తున రోగులు పాల్గొనడంతో ప్రాంగణం కిక్కిరిసింది. తొలుత దివంగత నందమూరి తారక రామారావు, ఏలూరి నాగేశ్వరరావుల చిత్రపటాలకు పూల మాలలు వేసి వైద్యశిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. గుంటూరు నగరంలోని పెద్దకాకాని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జాగ్రఫీ నేతృత్వంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం వివిధ గ్రామాల నుండి 700లకు పైగా రోగులకు పరీక్షలు నిర్వహించగా అందులో 300 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించి నట్లు క్యాంపు ఇన్‌చార్జ్ రవికుమార్ తెలిపారు. వైద్యశిబిరానికి హాజ రైన రోగులకు ఎలాంటి అసౌక ర్యం కలగకుండా ఎమ్మెల్యే ఏలూ రి క్యాంపు కార్యాలయం సిబ్బంది సారథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు, భోజన వసతి కూడా కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్.షంషుద్దీన్, మక్కెన శేఖర్‌బాబు, ఏజీపీ కొల్లా నరేంద్రకుమార్, ఆకుల శ్రీనివాసరావు, చెరుకూరి శ్రీధర్, కాపు రవిచంద్ర, దండా శ్రీనివాసరావు, కొరిటాల సురేష్, దాసి కిరణ్, దొప్పల పూడి ఆదినారాయణ, విన్నకోట సతీష్, భీమినేని అంజనేయులు, గన్నపనేని నాని, శ్రీరాం వెంకట సుబ్బారావు, షేక్. హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రాజేష్

చినగంజాం, జూలై 13(ఆంధ్రజ్యోతి) : బీజేపీ మండల అధ్యక్షుడిగా ఉలిచి రాజేష్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోపిరాల రైల్వేగేటు కూడలిలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం రాత్రి ఎన్నిక నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు కొండమూడి బంగారుబాబు అధ్యక్షతన ఈ ఎన్నిక నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన రాజేష్‌ను బీజేపీ నాయకులు రేపాక మంగతయారు, ఉలిచి ఏసుబాబు, శిఖరం కోటయ్య, అనుమాలశెట్టి శ్రీనివాసరావు, కోలా సుబ్బారావు, షేక్.జిలాని, అమరా మోహనరావు, ఎం.వెంకటేశ్వరరావు, ఎన్‌సీ.సుబ్బారావు, ఎస్.అనిల్‌కుమార్, సుబ్రహ్మణ్యం, అప్పలనాయుడులు శుభాకాంక్షలు తెలిపారు.

పేద ముస్లింలకు ఉచితంగా న్యాయసేవలు



జబ్బారును అభినందిస్తున్న ముస్లింలు

అద్దంకి, జూలై13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద ముస్లింలతో పాటు అన్ని సామాజిక వర్గాలలోని పేదలకు ఉచితంగా న్యాయపరమైన సహాయక సహకారాలు అందిస్తానని రాష్ట్ర ఎండబ్ల్యూఏ లీగల్ సెల్ ఇన్‌చార్జి షేక్ అబ్దుల్ జబ్బార్ అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా రోడ్డు సమీపంలోని కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె మీరసబాబు గుర్తింపు కార్డు, నియామక ప త్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం నేతలు జబ్బార్ ను అభినందించారు. కార్యక్రమంలో షేక్ అహ్మద్, అఫ్రిది, కరిముల్లా, హుస్సేన్ హజ్రత్, షేక్ రసూల్, అజాద్, రఫీ, అక్బర్ పాల్గొన్నారు.

తక్కువ వెడల్పుతో రహదారి నిర్మాణం

● అభ్యంతరం వ్యక్తం చేస్తున్నరైతులు



తక్కువ వెడల్పుతో నిర్మిస్తున్న బాక్స్‌స్ట్రక్చర్

అద్దంకి, జూలై13 (ఆంధ్రజ్యోతి): విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డులో స్థానిక అవసరాలను పట్టించుకోకుండా తక్కువ వెడల్పుతో బాక్స్ స్ట్రక్చర్స్(బ్రిడ్జిలు) నిర్మించడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అద్దంకి మండలంలోని పాతకొటికలపూడి నుంచి పాత ధేనువకొండ డొంక గ్రీన్ ఫీల్డ్ రోడ్డు క్రాస్ చేసే ప్రాంతంలో, సమీపంలో గుండ్లకమ్మ నదికి వెళ్లే డొంక వద్ద 12 అడుగుల వెడల్పుతో బాక్స్ స్ట్రక్చర్స్ నిర్మాణం చేసేందుకు సిద్ధం చేశారు. విషయం తెలుసుకున్న పార్వతీపురం, కొత్తకొటికలపూడి, వేణుగోపాలపురం గ్రామస్థులు శనివారం రోడ్డు నిర్మాణ పనుల జరిగే ప్రాంతానికి వెళ్లి అభ్యంతరం తెలిపారు. కనీసం 20 అడుగుల వెడల్పుతో నిర్మించాలని, అలా నిర్మించకపోతే వరిగడ్డి, సుబాబుల్ లోడు లతో వచ్చే ట్రాక్టర్ లు ఎలా రాకపోకలు సాగిస్తారని రైతులు ప్రశ్నించారు. మార్పు చేయకుండా అదే విధంగా పనులు కొనసాగిస్తే సోమవారం పనులు అడ్డుకుంటామని సర్పంచ్ పూనాటి విక్రమ్ తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి రవికుమార్ దృష్టికి కూడా తీసుకు పోనున్నట్లు తెలిపారు. ఇప్పటికై 20 అడుగుల వెడల్పు ఉండేలా బాక్స్‌ల నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

దూర్జటి కవి భక్తితత్వం అజరామరం

అద్దంకిటౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాజుల్ మంత్రుల్ వారి సేవ నరక ప్రాయంబు అని నాటి రాజులను ఈసడించుకున్న కవి రాజు దూర్జటి భక్తితత్వం అజరామరం అని ఉపన్యాసకులు వారణాసి రఘురామశర్మ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక కమలేశ్వరి స్వామి ఆలయం లో సృజన సాహిత్య సమావేశం పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దూర్జటి మహాకవి భక్తితత్వం అనే అంశంపై రఘు రామశర్మ ఉపన్యసించారు. సాలీడు, పాము, ఏనుగు, తిన్నడు శివుని సేవించి మోక్షం పొందిన కథలను రసరమ్యంగా శ్రీ కాలహస్తీశ్వర మహత్మ్యం కావ్యంలో దూర్జటి ఆవిష్కరించారన్నారు. అనంతరం రోటరీ క్లబ్ 2024-25 కార్యవర్గ సభ్యులను సృజన బృందం సత్కరించింది. కార్యక్రమంలో మలాది శ్రీనివాసరావు, దివాకర్ దత్తు, అనీల్ కుమార సూరి, వీరవల్లి రుద్రయ్య, డాక్టర్ యు. దేవపాలన, లే వి ప్రసాద్, పసుమర్తి చిన్న కొటయ్య, భువనేశ్వరి, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెపటైటిస్ బీ, సీ నిర్ధారణ పరీక్షలు

అద్దంకిటౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అద్దంకి పట్టణంలోని పసుమర్తిపాలెంలో ఇంటింటికి వెళ్లి హెపటైటిస్ బీ, సీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. లో హైరిస్క్ వ్యక్తులకు హెపటైటిస్ బీ, సీ నిర్ధారణ పరీక్షలు ఎంపిక చేసిన స్త్రీలకు నిర్వహించారు. ఈ పరీక్షలలో నెగిటివ్ వచ్చిన వారికి హెపటైటిస్ బి వ్యాక్సిన్ వేడయం జరుగుతుందని సిబ్బంది తెలిపారు. హెచ్‌ఐవితో పాటు ఇతర వైరల్ ఇన్ఫెక్షన్‌ను అరికట్టడంలో ఇది ముందడుగు అని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఔట్రీచ్ వర్కర్ టి. దుర్గాభవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం జె. రాధమ్మ, ఔట్రీచ్ వర్కర్‌లు లక్ష్మి, తేజశ్విని, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మేదరమెట్ల, జూలై 13(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పి పడి యువకుడి మృతి చెందిన ఘటన ఆదివారం ఉదయం కొరిశపాడు మండలంలోని జాతీయ రహదారిలో మేదరమెట్ల వద్ద చోటుచేసుకొంది. కొరిశపాడు గ్రామానికి చెందిన పాలేటి రాకేష్(22) ద్విచక్రవాహనంపై మేదరమెట్ల నుంచి స్వగ్రామం కొరిశపాడు వెళ్తుండగా, వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. రాకేష్ తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికి అక్కడే మృతి చెందాడు. ఘటన స్థలాన్ని మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ పరిశీలించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కారు బోల్తా - తప్పిన ప్రమాదం

మార్టూరు,జూలై13(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై గుంటూరు వైపు మండల పరిధిలో జొన్నతాళి రోడ్డు వద్ద పెట్రోలు బంకు ఎదురుగా ఆదివారం కారు బోల్తా పడింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలుకు చెందిన ఐదుగురు వ్యక్తులు కారులో కోటప్పకొండకు వెళుతున్నారు. వారి కారును వెనుక నుంచి వస్తున్న లారీ క్రాస్ చేస్తున్న సమయంలో, కారుకు లారీ తాకింది. దీంతో అదుపుతప్పిన కారు రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో రోడ్డుపై కారు బోల్తాపడింది. ఈ సమయంలో కారులోని కే.వెంకట్రావు, గంటా రామారావు, నాగిరెడ్డి, ఎన్.ఆచారి, మరో వ్యక్తి ఉన్నారు. వారందరూ స్వల్పగాయాలతో బయటపడగా, వారిలో రామారావుకు చేయి విరిగింది. ఈ ప్రమాదం జరగగానే హైవే ఆంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను చిలకలూరిపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అనంతరం అక్కడ నుంచి బాదితులు ఒంగోలుకు వెళ్లిపోయారు. అదేవిధంగా గాయపడిన రామారావును ఒంగోలు లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు.ఇదిలా ఉండగా హైవే మొబైల్ వారు రోడ్డుపైన ఉన్న కారును తొలగించి,ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

వెంకట సుబ్బారావుకు ఐరావతం అవార్డ్

పంగులూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన సిద్ధు వెంకట సుబ్బారావు స్వర్ణ ఐరావతం జాతీయ అవార్డు లభించింది. విశ్వకర్మ సిద్ధుసేవాసంఘం ఆధ్వర్యంలో సామాజిక సేవారంగంలో సిద్ధు వెంకట సుబ్బారావు చేస్తున్న కృషిని గుర్తించిన తెలుగు సంస్కృతి సాహితి సేవాట్రస్ట్ వరంగల్ వారు ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు అందజేశారు. వరంగల్ నగరంలో సాహితి సేవాట్రస్ట్ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో హైకోర్ట్ అడ్వకేట్, సోషల్ వర్కర్ స్వర్ణలత వడ్డేరాజు, తెలంగాణ హైకోర్ట్ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ మంజుల మదరం, ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ గౌరిశంకర్ చేతులు మీదగా వెంకట సుబ్బారావు స్వర్ణ ఐరావతం జాతీయ అవార్డు అందుకున్నారు. సామాజిక సేవారంగంలో సేవాకార్యక్రమాలు చేపడుతూ అవార్డులు అందుకున్న సిద్ధు వెంకట సుబ్బారావును మండల విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

యథేచ్ఛగా చెరువు మట్టి అక్రమ తరలింపు



మట్టిని తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

అద్దంకి, జూలై13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాయపాలెం చెరువు నుంచి మట్టి యథేచ్ఛగా తరలిస్తున్నారు. నాటి వైసీపీ ప్రభుత్వంలో చెరువులో మట్టి తరలించారు. ప్రస్తుతం కూడా తరచూ ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి చెరువు లో మట్టి తరలిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఇష్టానుసారం చెరువు మట్టి తరలించడం ద్వారా పెద్ద పెద్ద గోతులు ఏర్పడితే, భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సమీపంలోనే నివాసగృహాలు కూడా ఉండడంతో ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఉపాధి కూలీలు కూడా ఏటా అదే చెరువులో పూడికతీత పనులు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో అదే ప్రాంతంలో ఎక్స్‌కవేటర్లతో మట్టితవ్వడం ఇబ్బందికరంగా మారుతోందని కూలీ లు కూడా అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు లో అక్రమ మట్టి తవ్వకాలు నిలిపివేసేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అదనంగా మూడు బర్లీ కొనుగోలు కేంద్రాలు

పర్చూరు,జూలై13(ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో నియోజకవర్గంలో మూడు బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా భాగంగా సోమవారం ఉదయం మార్టూరు వ్యవసాయ మార్కెట్‌లో, మధ్యాహ్నం పర్చూరు మండలంలోని అడుసుమల్లిలో, యద్దనపూడి మండలంలోని పొగాకు రైతులు కోసం పొగాకు కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. అంతేగాకుండా మంగళవారం సాయంత్రం గొనసపూడిలో నల్ల బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. అదేవిధంగా అదేరోజు సాయంత్రం 5 గంటలకు గొనసపూడిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిలో చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు.

ఎన్ఆర్ఐ నేస్తం ఆధ్వర్యంలో వైద్యశిబిరం



వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఇంకొల్లు, జూలై 13, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు రోటరీక్లబ్ సహకారంతో ఎన్ఆర్ఐ నేస్తం ఆధ్వర్యంలో స్థానిక రోటరీగంగలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి ప్రముఖ వైద్యులు వైద్యసేవలు అందించారు. సెంటినీ విజయవాడ, కిమ్స్‌చక్ర క్యాన్సర్‌సెంటర్ గుంటూరు, స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ ఒంగోలు వైద్యులు రోగులకు గుండె, కంటి, కేన్సర్ సంబంధిత పరీక్షలు నిర్వహించారు. వైద్యశిబిరాన్ని డాక్టర్ కృష్ణమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష కార్యదర్శులు బలగం కోటేశ్వరరావు, రాఘవరెడ్డి, సభ్యులు పేర్ని సత్యనారాయణ, బెల్లంకొండ వాసుదేవరావు, రామ్మోహనరావు తదితరలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మార్టూరు,జూలై13(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని వివిధ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రజారోగ్యం పట్ల జాగ్రత్త వహించండి

చీరాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వైద్యసేవలు పొందేందుకు వైద్యశాలకు వచ్చే రోగుల పట్ల జాగ్రత్తలు పాటించాలని సూపరిండెంట్ డా.శ్రీకాంత్ అన్నారు. కాన్పుల వార్డులో ఆయమ్మలతో వైద్యసేవలు అందించడంపై ' ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో ఉన్నతాధికారుల స్పష్టమైన ఆదేశాలతో నాణ్యమైన సేవలు వైద్యశాలలో అందిస్తున్నట్లు తెలిపారు. అయితే కాన్పుల వార్డులో జరిగిన వ్యవహారంపై విచారిస్తున్నట్లు చెప్పారు. ప్రజలసేవల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా సిబ్బంది వ్యవహరించాలని సూచించారు. భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు మంత్రి పర్యటన

బల్లికురవ. జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం సాయంత్రం పర్యటించనున్నారు. చెన్నుపల్లి- వైదన గ్రామాల మధ్య రూ.3 కోట్లతో అభివృద్ధి చేసిన బీటీ రోడ్డును మంత్రి రవికుమార్ ప్రారంభించనున్నారు. అలానే గ్రామంలో రూ. 10 లక్షలతో అభివృద్ధి చేసిన సీసీ రోడ్లను ప్రారంభిస్తారు.

క్రీడలతో పోటీతత్వం

• రెవెన్యూ క్రీడోత్సవాల ముగింపు సభలో కలెక్టర్


క్రీడోత్సవాల ముగింపు సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), జూలై 13(ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా పోటీ తత్వం, ప్రశ్నించేతత్వం పెరుగుతుందని కలెక్టర్ ఓ. ఆనంద్ అన్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన రెవెన్యూ క్రీడోత్సవాలు ఆదివారం రాత్రి క్యాంప్ ఫైర్‌తో ముగిశాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల ద్వారా వచ్చిన స్ఫూర్తిని పనుల్లో చూపించనట్లయితే మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు. రెవెన్యూ సిబ్బంది బాగా పనిచేస్తే, జిల్లా యంత్రాంగానికి మంచిపేరు వస్తుందని తెలిపారు. ఏపీఆర్ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బందిని అందరినీ ఒక చోటకు చేర్చి క్రీడలు నిర్వహించటం గొప్పవిషయమన్నారు. రాష్ట్ర స్థాయిలో త్వరలో ఈ క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

• తిలకించేందుకు వచ్చిన ఉద్యోగులు

శని, ఆదివారాల్లో వరుస సెలవులు రావటంతో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు రెవెన్యూ క్రీడలను తిలకించడానికి వచ్చారు. క్రికెట్, షటిల్, వాలీ బాల్, పుట్‌బాల్, లాంగ్ జంప్, పరుగు పందెం, చెస్, క్యారమ్స్, షార్ట్‌పుట్, లెమన్ స్పూన్, టగ్ ఆఫ్ వార్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో తదితర పోటీలు మూడు రోజుల పాటు జరిగాయి. చివరిరోజు కార్యక్రమానికి సీసీఎల్‌ఏ జీ. జయలక్ష్మి హాజరయ్యారు. ఆదివారం కలెక్టర్ టీం, డివిజన్ల టీమ్ మధ్య షటిల్, వాలీబాల్ పోటీలను ఆమె ప్రారంభించారు. జయలక్ష్మి, కలెక్టర్ కాసేపు షటిల్, వాలీబాల్ ఆడారు.

బహుమతుల అందజేత

మహిళా విభాగంలో 35 ఏళ్లలోపు 100 మీటర్ల పరుగుపందెంలో గెలుపొందిన సాహిత్య, అనూష, శాంతిప్రియలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను సీసీఎల్‌ఏ ముఖ్య కార్యదర్శి జీ. జయలక్ష్మి కలెక్టర్ ఆనంద్‌తో కలిసి అంద చేశారు. అలాగే 200 మీటర్ల పరుగుపందెలో సాహిత్య, హవీ, శాంతిప్రియలకు, షార్ట్ పుట్‌లో శ్యామలత, అనూష, కావ్యశ్రీకు బహుమతులు అంద చేశారు. డిస్కస్‌త్రోలో సాయి శరణ్య, సుష్మిత, వదనలకు, జావెలిన్‌త్రోలో శాంతి ప్రియ, సాయి శరణ్య, సుస్మితవదనలకు, లాంగ్ జంప్‌లో సాయి శరణ్య, సాహిత్య, ఝాన్సీలకు, హైజంప్‌లో సాయి శరణ్య, శాంతి ప్రియ, హావీలకు బహుమతులు వచ్చాయి. 400 మీటర్ల రిలే పరుగు పందెంలో నెల్లూరు, కందుకూరు టీమ్‌లకు బహుమ తులు అందచేశారు. ముగింపు కార్యక్రమంలో గురుకృప కళాక్షేత్రం, డేగా సాంబ శివరావు శిష్యం బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంత గానో అలరించాయి. ఈ కార్యక్రమాల్లో డీఆర్‌వో హుస్సేన్ సాహెబ్, ఏపీఆర్ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బహుమతులందుకున్న వారితో సీసీఎల్‌ఏ జయలక్ష్మి, కలెక్టర్ ఆనంద్ తదితరులు


చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు


అతడే డాన్...!

- ఆయన కనుసన్నల్లోనే రేషన్ మాఫియా
- గుడిపల్లిపాడు కేంద్రంగా నడుస్తున్న వ్యవహారం
- అన్నీ నియోజకవర్గాల్లోనూ సిండికేట్లు
- సీఎస్ డీటీలకు తెలిసినా మౌనం
- సెగ్మెంట్‌కు నెలకు రూ.20 లక్షల పంపకాలు..?
- కలెక్టర్, జేసీ దృష్టి సారిస్తేనే అక్రమాలకు అడ్డుకట్ట

నెల్లూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పేరుకేమో అతనో సామాన్య వ్యక్తి... ఎవరూ నమ్మని విధంగా ఏదో చిన్న వ్యాపారం చేసుకుంటున్నాడులే అనుకునేలా ప్రవర్తిస్తుంటాడు... కానీ తెరవెనుక నడిపేది మాత్రం రేషన్ మాఫియాను..! ప్రతీ నెలా వేల టన్నుల రేషన్ బియ్యాన్ని దారి మళ్లించడం... తద్వారా రూ.కోట్లు ఆర్జించడం అతడి పని.! ఇదేదో ఇప్పుడు మొదలైం దనుకుంటే పొరపాటే... గత కొన్నేళ్లుగా రేషన్ మాఫియాకు ఆ వ్యక్తి నాయకుడిగా వ్యవహరి స్తున్నాడు. ప్రతీ నియోజకవర్గంలో రేషన్ సిండికేట్లు నడుస్తుండగా, వారందరికీ పెద్ద దిక్కుగా ఆ వ్యక్తి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. నెల్లూరు నగరంలో మూడు జెండాల సెంటర్‌కి చెందిన ఈ మాఫియా డాన్.. గుడిపల్లిపాడులోని పలు మిల్లుల కేంద్రంగా రేషన్ బియ్యం రీసైక్లింగ్‌ను జరుపుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. జిల్లా మార్కెట్ అవసరాలకు మించి రేషన్ బియ్యం తమ వద్దకు వస్తే.. ఆ బియ్యాన్ని కాకినాడ ప్రాంతానికి పంపుతున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ప్రభుత్వానికి చేరవేశాయి. అయితే ఈ రేషన్ అక్రమార్కులకు తెరవెనుక రాజకీయ నేతలు అండదండలు అందిస్తుండడం గమనార్హం. ఇందుకు వారికి భారీగానే లబ్ధి చేకూరుతున్నట్లు తెలుస్తోంది.

• తిలాపాపం తలా పిడికెడు

జిల్లాకు ప్రతీ నెలా సుమారు 10 వేల టన్నుల రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఇందులో రెండు వేల టన్నులకు పైగా బియ్యం మాఫియా చేతుల్లోకి వెళుతున్నట్లు అంచనా. రేషన్ పంపిణీ చేసే సమయంలోనే కొనుగోళ్ల తంతు ముగుస్తోంది. రేషన్ దుకాణాల్లో ఇచ్చే బియ్యం నాణ్యతగా ఉంటున్నా, ప్రజల్లో ఈ బియ్యంపై అపోహలున్నాయి. ఈ కారణంతో చాలామంది బియ్యాన్ని చూడకుండానే రేషన్ దుకాణాల వద్దే డబ్బులు తీసేసుకుంటున్నారు. ఇలా కార్డుదారుల నుంచి కేజీ బియ్యాన్ని రూ.15కు తీసుకోవడం, ఆ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి తిరిగి మార్కెట్లో కేజీ రూ.60కు పైగా విక్రయిస్తున్నారు. ఈ లెక్కన సుమారు ప్రతీ నెలా రూ.10 కోట్ల వరకూ మాఫియా సంపాదిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ డబ్బును ప్రతీ నియోజకవర్గంలోనూ పంచుతున్నట్లు తెలుస్తోంది. మండల స్థాయి, నియోజకవర్గస్థాయి నేతలకు భారీగానే అందజేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నిఘా వర్గాలకు వచ్చిన సమాచారం మేరకు ఒక్కో నియోజకవర్గంలో ప్రతీ నెలా రూ.20 లక్షల వరకూ ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలకు మాఫియా అందిస్తున్నట్లు తెలిసింది.



• ఉన్నతాధికారులు దృష్టి పెడితేనే..!

ప్రభుత్వ లక్ష్యానికి రేషన్ మాఫియా తూట్లు పొడుస్తోంది. పేదలకు ఉచితంగా అందిస్తున్న బియ్యాన్ని వారిలో అపోహలు కలిగించి ఆ బియ్యాన్ని తమ పరం చేసుకుంటోంది. తిరిగి ఇదే బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి పేదలకు అధిక ధరలకు విక్రయిస్తోంది. రేషన్ మాఫియా చేసే అక్రమాలన్నీ సీఎస్ టీడీలకు తెలుసునన్న ప్రచారం జరుగుతోంది. కొన్ని లారీల బియ్యం నేరుగా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు కాకుండా మిల్లులకే చేరుతున్నట్లు ఆరోపణలున్నాయి. గతేడాది ప్రభుత్వం మారడంతో ఈ రేషన్ మాఫియా సభ్యులు.. అన్ని నియోజకవర్గాల్లో సాఫీగా వ్యాపారం చేసుకునేందుకు స్థానిక నేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు. రేషన్ బియ్యం అక్రమాలకు బ్రేకులు పడాలంటే కలెక్టర్, జేసీలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎంఎల్ఎస్ పాయింట్ల దగ్గర నుంచి రేషన్ దుకాణాలు, రైసు మిల్లుల వరకూ ఆకస్మికంగా తనిఖీలు చేస్తే చాలా వరకూ కట్టడి చేసే అవకాశాలున్నాయి.

ఎవరికి దక్కేనో..?

- నామినేటెడ్ పదవులపై తెలుగు తమ్ముళ్ల ఆశలు
- నెలాఖరుకు భర్తీ చేస్తామన్న మంత్రి లోకేష్
- కావలి ఏఎంసీ, బిట్రగుంట ఆలయ పోస్టులపై చర్చ

కావలి, జూలై 13(ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులపై తెలుగు తమ్ముళ్లు ఆశలు పెట్టుకున్నారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన వారిలో ఏ కొద్దిమందికైనా ఈ పదవులు దక్కుతాయన్న ఆశల పల్లకీలో వారున్నారు.ఇటీవల నెల్లూరుకు వచ్చిన ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఏఎంసీలు, ఆలయాల కమిటీలను ఈనెలాఖరుకు భర్తీ చేస్తామని స్పష్టత ఇచ్చారు. దీంతో అందరికీ పదవులపై ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ఉన్న నామినేటెడ్ పదవులు ఎవరిని వరిస్తాయానన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

• ఏఎంసీ మహిళకు కేటాయింపు

కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పోస్టును తొలుత దగదర్తి మండలానికి చెందిన పమిడి రవికుమార్ చౌదరికి ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి గతంలో హామీ ఇచ్చారు. అయితే అనూహ్య పరిణామాలలో అది బీసీ మహిళకు ప్రభుత్వం రిజర్వు చేసింది. ఈ విషయమై ఎమ్మెల్యే పోరాడి దాన్ని ఓసీకి మార్పు చేయించినా మళ్లీ కూడా మహిళకే కేటాయించారు. గతంలో ఏఎంసీ చైర్మన్‌గా పనిచేసిన మలిశెట్టి వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులకు అప్ప చెప్పాలనుకుంటే ఆయన కూడా దానికి సమ్మతించలేదని తెలిసింది. సహజంగా కావలి ఏఎంసీ చైర్మన్లుగా పనిచేసిన వారంతా, ఆ తర్వాత రాజకీయంగా పెద్దగా ఎదుగుదల లేకపోవడంతో సెంటిమెంటుగా భావిస్తున్న కొందరు ఆ పదవి పట్ల ఆసక్తి చూపడం లేదనే ప్రచారం సాగుతోంది. దీంతో రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండే నేతల సతీమణులకు ఇచ్చేదానికన్నా చురుగ్గా ఉండే మహిళా నేతకే ఆ పదవి కట్టబెట్టాలనే ఆలోచనతో ఎమ్మెల్యే ఉన్నారు. వైస్ చైర్మన్, డైరెక్టర్లను కూడా నామినేట్ చేసే అవకాశం ఉండటంతో పలువురు వాటిపై ఆశలు పెంచుకున్నారు.

• ప్రసన్నుడి ఆలయ కమిటీ..

కొండ బిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ పాలకవర్గం చైర్మన్ పదవికోసం పలువురు ఆశావహులు పోటీలో ఉన్నా.. దైవభక్తి, ఆలయ అభివద్ధికి దాతల నుంచి నిధులు తీసుకురాగల సత్తా ఉన్న నేత అయితే, ఆలయం అభివృద్ధి చెందుతుందనే ఆలోచనలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ముందు టీడీపీలో చేరిన శ్రీరాంమాల్యాద్రికి ఆ పదవి ఇవ్వాలనే ఆలోచనలో ఆయన ఉన్నట్లు తెలిసింది. కమిటీ డైరెక్టర్ల పదవులు కూడా ఉండటంతో వాటిని పలువురు ఆశిస్తున్నారు.


కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

• మూడు ఆలయాల కమిటీలపై కూడా...

కావలిలోని మూడు ఆలయాలకు కూడా నూతన పాలకవర్గాలను ఏర్పాటు చేయ నుండటంతో వాటిపై కూడా పలువురు ఆశలు పెట్టుకున్నారు. ఇటీవల దేవదాయశాఖలో కలిసిన కలుగోళ్ల శాంభవి ఆలయం, విష్ణాలయం, పాతూరు శివాలయాల కమిటీలు కొత్తవి కావడంతో వాటిపై పట్టణానికి చెందిన పలువురు కూటమి నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఇంతకు ఎవరిని పదవులు వరించనున్నాయో కార్యకర్తలు ఉత్కంఠగా ఎదురు చేస్తున్నారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల ప్రదర్శన

- ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలి
- యూనియన్ నేతల డిమాండ్

నెల్లూరు (వైద్యం) జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఆదివారం విధులను బహిష్కరించి, నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని గాంధీబొమ్మ నుంచి మద్రాసు బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనర్సయ్య, సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 10 నెలల నుంచి సీఎం చంద్రబాబుకు అనేక పర్యాయాలు అధికారులు విన్నవించినా నేటికి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. జీవో నెంబర్ 36 ప్రకారం వెంటనే కార్మికులకు జీతాలు పెంచాలని కోరారు. గత 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా, మట్టి ఖర్చులకు సంబంధించి హామీలు నేటికి నెరవేర్చలేదని చెప్పారు. వయోపరిమితి 62 ఏళ్లకు పెంచి గ్రాట్యూటీ చెల్లించాలని, బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలని, చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈనెల 17 నుంచి సమ్మె చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సూర్యనారాయణ, శివాజీ, సురేష్, మున్సిపల్ ఇంజనీరింగ్ నాయకులు శ్రీనివాసులు, బాలు, మనోజ్, కామాక్షమ్మ, తదితరులు పాల్గొన్నారు.



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలి

• ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బ్రాహ్మణ కార్పొరేషన్‌ను వెంటనే పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య డిమాండ్ చేసింది. నెల్లూరులోని దేవిశెట్టి స్వాములు, రాజేశ్వరి కల్యాణ మండపంలో సమాఖ్య రాష్ట్ర సర్వసభ్య సమావేశం, కార్యవర్గ ప్రమాణ స్వీకార సభ ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ హాజరయ్యారు. టిడ్కో గృహాలను అర్హులైన బ్రాహ్మణులకు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకట రామరాజు, రాష్ట్రంలోని 26 జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఈ. కామేశ్వర ప్రసాద్(నెల్లూరు), కార్య నిర్వాహక అధ్యక్షుడిగా గాలి శ్రీనివాసరావు (వినుకొండ), ప్రధాన కార్యదర్శిగా వీ. హరిప్రసాద్ (తిరుపతి), కోశాధికారిగా ఎన్ ఉమామహేశ్వరావు (కడప)తోపాటు రాష్ట్ర కార్యవర్గం, మహిళా కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. రాష్ట్ర మాజీ కార్యదర్శి వాసుదేవరావు, భువనేశ్వరీ ప్రసాద్ పాల్గొన్నారు.



సమాఖ్య కార్యవర్గంతో టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్

ఈడీ నోటీసుల జాబితాలో జిల్లా శ్రీమంతులు

- హవాలా మార్గంలో దుబాయ్‌లో ఆస్తుల కొనుగోలు ఫలితం
- బెంగళూరు కేంద్రంగా హవాలా మార్గంలో నగదు చెల్లింపులు
- రహస్య మార్గాల్లో వివరాలు సేకరించిన ఈడీ

నెల్లూరు, జూలై13 (ఆంధ్రజ్యోతి): హవాలా మార్గంలో దుబాయ్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం, అపార్టుమెంట్లలో ప్లాట్ల కొనుగోలు చేసిన వారిలో జిల్లా సంపన్నులు ఉన్నారా..!? ఈడీ నోటీసుల జాబితాలో మన వారు ఉన్నారా..!? అంటే... అవును ఉన్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. దుబాయ్‌లో జిల్లా శ్రీమంతులు ఆస్తులు కొన్నారని, ఆ క్రమంలోనే వారికి ఈడీ నోటీసులు ఇచ్చిందని, వాటిని పట్టుకొని వారు ఆడిటర్ల చుట్టూ తిరుగుతున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇంతకు నెల్లూరు ధనవంతులేమిటీ..!? దుబాయ్‌లో ఎందుకు ఆస్తులు కొనుగోలు చేస్తున్నారు, అలా చేస్తే తప్పేమిటి...? వీరికి ఎందుకు ఈడీ నోటీసులు ఇస్తోంది..? అనే వివరాల్లోకి వెళితే ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి.

• దుబాయ్‌లో ఎందుకు కొంటున్నారంటే..!!?



రాయలసీమ జిల్లాల్లో కాయకష్టం చేసుకునేవారికి ఆశ్రయం కలిగించే దేశంగా దుబాయ్ తెలుసు. కాని నెల్లూరు జిల్లా లాంటి సంపన్న జిల్లాలకు దుబాయ్ విస్తరిస్తున్న విలాస దేశంగానే తెలుసు. దుబాయ్ కష్టజీవులకు ఎలా ఉపాధి కేంద్రమో శ్రీమంతులకు ఇది ఒక భూతలస్వర్గం. క్రమక్రమంగా ఈ దేశానికి విదేశీ సంపన్నుల పర్యటనలు ఎక్కువ కావడంతో ఇక్కడ రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. దీంతో నెల్లూరీయుల కన్ను దుబాయ్‌పై పడింది. హవాలా ద్వారా ఇక్క డ ఆస్తులు కొంటే ఆదాయ పన్నుల శాఖ నివేదికలో వీటిని చూపించాల్సిన అవసరం లేకుండా అపార్టుమెంట్ల ద్వారా వచ్చే అద్దె రూపంలో పెట్టిన పెట్టుబడిపై 15 నుంచి 20 శాతం ఆదాయం పొందవచ్చనే ఉద్దేశ్యంతో దేశంలోని చాలా మంది శ్రీమంతులు దుబాయ్‌లో ఆస్తులు కొంటున్నారు.

• దుబాయ్‌లో నెల్లూరు ముద్ర

రాష్ట్రంలోని సంపన్న జిల్లాల్లో నెల్లూరు ఒకటి. ఇక్కడ వందల,వేల కోట్ల రూపాయల ఆస్తులు కలిగిన శ్రీమంతులు వందల సంఖ్యలో ఉన్నట్లు అంచనా. సంపన్నులైన రాజకీయ నాయకులే కాకుండా అజ్ఞాతంగా వీరిని మించిన ధనవంతులు కూడా నెల్లూరులో చాలా మంది ఉన్నారు. ఇలాంటి వారిలో కొందరు తమ పెట్టుబడులను దుబాయ్‌కి మళ్లించినట్లు తెలిసింది. బెంగళూరు కేంద్రంగా వీరు క్రిప్టో, హవాలా రూపంలో పెట్టుబడులను చేరవేశారు. ఇలా దుబాయ్‌లో ఆస్తులు కొన్న వారి జాబితాను ఈడీ సేకరించింది. వీరందరికి నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో నెల్లూరుకు చెందిన కొందరికి ఈడీ నుంచి నోటీసులు అందడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఇలా నోటీసులు వచ్చిన వారు ఆడిటర్లను కలవడం, వారు ఇది తమ పరిధిలో చేయలేమని హైదరాబాద్‌లో తాము సూచించిన ఆడిటర్లను కలవమని సలహా ఇచ్చినట్లు తెలిసింది. ఆనోటా ఈనోటా ఈ విషయం ప్రచారం కావడంతో ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో దుబాయ్ ఆస్తుల వ్యవహారం పెద్ద చర్చనీయాంశంగా మారింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100): 515

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9414
వెండి కిలో ధర	రూ. 115600
వెండి ఒక గ్రాము	రూ.118.60

కరేడులో పర్యటించిన ఎమ్మెల్సీ తూమాటి

ఉలవపాడు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు ప్రాంతంలోని టెంకాయచెట్ల పాలెం, కొత్త, పాత పల్లెపాలెంలు, చైతన్యనగర్ ఎస్సీ కాలనీ, మందబైలు సంఘం ఎస్టీ కాలనీలలో ఆదివారం ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు పర్యటించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కరేడులో భూసేకరణ విషయంపై ప్రజాగ్రహం, ఎస్సీ, ఎస్టీ, మత్స్యకారుల అభీష్టం తెలుసుకునే ందుకు రెండు రోజులు పర్యటించానన్నారు. ఇక్కడి పరిస్థితులను త్వరలో జరగనున్న డీఆర్సీ, అసెంబ్లీ సమావేశాల్లో వివరిస్తానన్నారు.

న్యూస్ బాక్స్

కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగానికి తీరని లోటు

అల్లూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి) : సినీరంగంలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న కోట శ్రీనివాసరావు మృతి ఆ రంగానికి తీరని లోటని కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు బడబాగ్ని ఆంజనేయరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏ పాత్రలోనైనా నటించి ప్రేక్షకులతో శభాష్ అనిపించుకునే విలక్షణ నటుడిగా మంచి గుర్తింపును, ప్రేక్షకుల మన్ననలను పొందిన కోట మృతి చెందడం బాధాకరమన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఏ జిల్లా యాసలో అయినా సునాయాసంగా డైలాగులు చెప్పి మెప్పించగలిగే సత్తా కలిగిన నటుడని, ప్రతి అభిమాని గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. ఆయన మృతిపట్ల ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక

బిట్రగుంట, జూలై 13(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేటలోని రైల్వే మిక్సిడ్ తెలుగు మీడియం పాఠశాలలో 1980-81వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థుల కలయిక ఆదివారం జరిగింది. 45 ఏళ్ల తరువాత పాతమిత్రులు కలుసుకోవడంతో ఆప్రాంతంలో పండగ వాతావరణం నెలకొంది. కలిసి చదువుకున్న ఊరిని మరువకుండా పూర్వపు విద్యార్థులు కలుసుకోవండం మంచి సాంప్రదాయమని డాక్టర్ రభాని, మాజీ సైనికుడు బోయపాటి సుధాకర్, డివిజనల్ సర్వేరు శ్రీనివాసులు అన్నారు.

అపస్ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం

కందుకూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(అపస్) ప్రాంతీయ కార్యాలయాన్ని ఆదివారం కందుకూరులో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి శిక్షణ తరగతులలో సత్యనారాయణ, రాష్ట్ర సంఘటన కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు చక్రపాణి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హిమజ, రాజగోపాల్‌బాబు, ఆకురాతి బలరామకృష్ణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కాలువ పనులు వేగవంతం

● కలుగోళ్ల శాంభవి ఆలయానికి మహర్దశ



వరవ కాలువలో నిర్మిస్తున్న కాంక్రీట్ పిల్లర్లు

కావలి, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలుగోళ్ల శాంభవి ఆలయ ప్రాంగణం ఆధునికీకరణలో భాగంగా దానిని ఆనుకుని ఉన్న వరవ కాలువపై శ్లాబు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతోన్నాయి. ఈ పనులు పూర్తయితే ఆలయానికి మహర్దశ పట్టనుంది. కాలువపై శ్లాబు నిర్మాణం కోసం పురపాలక సంఘం నుంచి రూ.40 లక్షలు మంజూరు చేయగా ఆ నిధులతో పనులు చకచక సాగుతున్నాయి. శ్లాబ్ నిర్మాణ పనుల కోసం కాలువ మధ్యలో కాంక్రీట్ పిల్లర్లు నిర్మించి దానిపై శ్లాబు వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. శ్లాబ్ నిర్మాణం అయితే ఆ కాలువ ప్రాంతం కూడా ఆలయం లోపల ఆవరణలో కలిసి ఆలయానికి మంచి వాస్తు ఏర్పడటమే కాక ఆలయం లోపల విశాలంగా వసతి ఏర్పడుతోంది. కలుగోళ్ల శాంభవి ఆలయం వద్ద ఆర్వోబీ స్థానంలో రైల్వే అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలనే ఆలోచనలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ప్రభుత్వంతో చర్చిస్తున్నారు. అదే జరిగితే ఆలయం వద్దకు వెళ్లే దక్షిణం వైపున ఉన్న ప్రధాన మార్గం మూసుకుపోతోంది. దీంతో ముందు చూపుగా ఆలయానికి ఈశాన్యం తక్కువగా ఉండటంతో ఆ ప్రాంతంలో ఉన్న వరవ కాలువపై శ్లాబ్ నిర్మాణం చేపట్టి దాని మీదుగా ఆలయంలోకి తూర్పు మార్గంలో ప్రవేశ ద్వారం ఏర్పాటు చేసేందుకు నిర్మాణ పనులు చేపడుతున్నారు. దీంతో ప్రస్తుతం ఆలయానికి ఈశాన్యం తగ్గి వాస్తు లోపం ఉండటంతో శ్లాబ్ నిర్మాణంతో ఈశాన్యం పెరిగి వాస్తు దోషం కూడా పోయే అవకాశాలు ఉన్నాయి. అలాగే అక్కడ రైల్వే అండర్‌పాస్ మంజూరు కోసం ఆలయానికి దారి ఉండదన్న ప్రధాన ఆటంకాలు కూడా తొలగిపోయి అండర్‌పాస్ మంజూరుకు మార్గం సుగమం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

బస్టాండ్ సెంటర్‌లో యాచకుడి మృతి



వలేటివారిపాలెం బస్టాండు సెంటర్‌లో యాచకుడి మృతదేహం

వలేటివారిపాలెం, జూలై 13(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం బ స్టాండు సెంటరులో పామూరుకు చెందిన గురునాథం నాగరాజు(30) అనే యాచకుడు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. నాగరాజు ప్రతిరోజూ వలేటివారిపాలెం బస్టాండు సెంటరులో భిక్షాటన చేస్తూ సమీపంలోని కేజీబీవీ స్కూల్ పక్కన ఉన్న ఎస్టీ కాలనీలో జీవనం సాగిస్తు న్నాడు. సమాచారం తెలుసుకున్న వలేటివారిపాలెం ఎస్‌ఐ మరిదినాయుడు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. నాగ రాజుకు ఉబ్బసం, శ్వాసకోశ వ్యాధి ఉన్నట్లు పోలీసులు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుట్టుగా గుట్కా విక్రయాలు!

వలేటవారిపాలెం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలో గుట్కా విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గ్రామాల్లోని కిరాణ షాపులు, టీ, సిగిరెట్, కూల్‌డ్రింక్స్ తదిరత బడ్డీకొట్టుల్లో గుట్కా విక్రయిస్తున్నట్లు తిలిసింది. రాష్ట్ర ప్రభుత్వం గుట్కాలను నిషేధించింది. అయినప్పటికీ వలేటివారిపాలెం మండలంలో గుట్కా విక్రయాలు జోరు తగ్గడం లేదు. గుట్కా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయల్లా వర్ధిల్లుతుంది. ప్రభుత్వం వివిధ ప్రచారాల ద్వారా గుట్కా వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం గుట్కా అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. సిగిరెట్, గుట్కాలు అనారో గ్యాన్ని హాని కలిగిస్థాయని తెలిసినా యువత వాటికి బానిసలుగా మారిపో తున్న దుస్థితి నెలకొంది. ప్రతి బడ్డీ కొట్టులోనూ, కిరాణా దుకాణాలలో గుట్కా వ్యాపారం రహస్యంగా జరుగుతుంది. ఈ క్రమంలో మండలంలో గుట్కా వ్యాపారాలు లక్షల్లో జరుగుతున్నట్లు తెలుస్తోంది. యువత గుట్కా మత్తులో చిక్కుకొని కొట్టుమిట్టాడుతోంది. గుట్కాలో నికోటిన్ అనే పదార్థం ఉండడంతో ప్రాణానికి ముప్పు వాటిల్లే పరిస్థితులు ఉన్నాయని వైద్య నిపుణులు అంటున్నారు. గుట్కాతో ఆకలి మందగించి చిగుళ్ల వ్యాధి శరీరంలోని ఏ బాగానికైనా వ్యాపించి కేన్సర్ సోకే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే గుట్కా విక్రయాలను నియంత్రించాల్సిన ఆయా శాఖల అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి చేయూత



అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి వంటసామగ్రి, దుస్తులు, బియ్యం అందచేస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, జూలై 13(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆదివారం కావలి రెడ్‌క్రాస్ బాధ్యులు వంటసామగ్రి, దుస్తులతోపాటు ఒక బియ్యం బస్తాను అందజేశారు. కావలి మండలం గౌరవరం గిరిజన కాలనీకి చెందిన గోల్కొండ వెంకాయమ్మ కుటుంబం శనివారం ఉదయం పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో ఒక్క వస్తువు మిగలకుండా సర్వస్వం కాలిపోయాయి. ఈ విషయాన్ని స్థానిక నాయకుడు చింతం బాబుల్‌రెడ్డి, గిరిజన కార్యకర్త ఇండ్ల సురేంద్ర రెడ్‌క్రాస్‌కు సమాచారం అందిం చారు. దీంతో రెడ్‌క్రాస్ విపత్తుల నిర్వహణ విభాగం కన్వీనర్ జనిగర్ల మనోహర్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ బృందం ఆదివారం గౌరవరం వెళ్లి జిల్లా రెడ్‌క్రాస్ అందించిన వంట పాత్రల సెట్, కావలి రెడ్‌క్రాస్ ద్వారా దుస్తుల కిట్, మనోహర్ సొంత నిధులతో ఒక బియ్యం బస్తాను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కావలి ఛైర్మన్ డీ.రవిప్రకాష్, వైస్‌ఛైర్మన్ కే.హరినారపరెడ్డి, పాలకమండలి సభ్యులు బీద లక్ష్మానంద, బెజవాడ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నృత్య కళా చిన్నారులకు అభినందన



చిన్నారులను అభినందిస్తున్న డాక్టర్ శివప్రసాద్

కావలి, జూలై 13(ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ ఆ ధ్వర్యంలో రక్తం యొక్క ఆవశ్యకతపై ఇటీవల జరిగిన లఘు నాటిక ప్రదర్శనలో ప్రతిభచాటి ప్రథమ బహుమతిని పొందిన సంయుక్త నృత్యకళానిలయంలో నృత్యకళా చిన్నారులను బీవీ రత్నమ్మ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో అభినందించారు. ఆదివారం క్రిష్టియన్‌పేట మొదటిలైన్‌లో ఉన్న నృత్యకళానిలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ పామూరు శివప్రసాద్, ట్రస్ట్ నిర్వహ కు డు ప్రసాదరావు మాట్లాడుతూ ఈ చిన్నారులు రక్తం యొక్క ఆవశ్యకతపై చేసిన లఘునాటిక చూపరులను కంటతడి పెట్టించిందన్నారు. రక్తం దొరకని పక్షంలో బాధితులు పడే ఆవేదనను కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు. ఈ సందర్భంగా ఆ చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే నాట్యగురువు గంగపట్నం లిఖితను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు షేక్ ఖాదర్‌బాషా, జి.కల్యాణి, పచ్చిపులుసు వెంకన్న, అర్వపల్లి నాగరాజు, పామూరు రాజ పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు ఇస్తున్నాం

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కందుకూరులో శాకాహార ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

గుడ్లూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పొట్లూరు రాజుల బజార్, పొట్లూరు గిరిజన కాలనీల్లో ఆయన ఆదివారం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఇప్పటి వరకు అమలు పరిచిన సంక్షేమ పథకాలను వివరించ్చారు. కాలనీల్లో ప్రతి పిల్లవాడికి తల్లికి వందనం వందశాతం అందడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కొందరు గిరిజనులు ఇళ్ల స్థలాలు లేవని, సరైన సైడుకాలువలులేక ఇబ్బందులు పడుతున్నామని తెలపగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఉందుగా గోపయ్య సమేత తిరపతమ్మను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, నాయకులు పాతపల్లి శ్రీనివాసరాజు, చౌటూరి సుబ్బారావు, ఎస్‌కే రహంతుల్లా, ఉమ్మినేని సుబ్బారావు, చిత్తారి మల్లికార్జున, పువ్వాడి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మహాకరుణ శాకాహార మెగా ర్యాలీ

కందుకూరు : పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం కందుకూరు పట్టణంలో మహాకరుణ శాఖాహార మెగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి కోటారెడ్డి నగర్‌లోని టీటీడీ కల్యాణ మండపం వరకు నిర్వహించిన ఈ ర్యాలీని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు, సామాజిక సేవాసంస్థల ప్రతినిదులు, శాఖాహారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు సంక్షేమం

లింగసముద్రం, జూలై 13(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే ప్రజల సంక్షేమం, అభివృద్ధి జరుగుతాయని టీడీపీ సీనియర్ నాయకుడు ఉన్నం వీరస్వామి చెప్పారు. మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో ఆదివారం సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉన్నం రమేష్, ఇతర టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కూటమి ప్రభుత్వంతోనే ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు బొల్లినేని సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

వైభవంగా అలఘునాథుడి కల్యాణం



అలఘునాథుడి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అలఘునాథస్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథుని కల్యాణం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆగస్టు 5వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరుగు మహా కుంభాభిషేక మహోత్సవానికి తమ వంతు సహాయ సహకారాలు అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శాకంబరి అలంకారంలో పాలేటి గంగమ్మ



సంగం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం ఆదివారం సందర్భంగా స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న పాలేటి గంగమ్మ తల్లి ఆలయంలో అమ్మవారు శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా క్షీర, పంచామృత, సకల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పలు రకాల కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో నాగవరపమ్మకు పూజలు



నాగవరపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంగం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగవరపమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నాగవపమ్మదేవి మూలవిరాట్‌కు క్షీర, సకల ద్రవ్య పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

ఘనంగా గంగాభవానీ అమ్మవారికి నెల పొంగళ్లు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉదయగిరి, జూలై 13 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గంగిరెడ్డిపల్లిలో ఉన్న అనంతపూరి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం గ్రామస్థులు నెలపొంగళ్లు ఘనంగా నిర్వ హించారు. ఈసందర్భంగా మహిళలు పొంగళ్ల సామగ్రితో మేళతాళాల నడుమ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి దంపతులు, టీడీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు యూడీఎఫ్ ప్రతినిధుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న యూడీఎఫ్ ప్రతినిధులు

ఉదయగిరి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను యూడీఎఫ్ ప్రతినిధులు షేక్ ఎండీ ఖాజా, వీ రామచంద్రమూర్తి కోరారు. ఈమేరకు ఆదివారం వారు మండలంలోని గంగిరెడ్డిపల్లికి వచ్చిన ఆయనకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో వర్షాధారం, చిన్న సాగునీటి వనరులపై ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తున్నారని, వర్షాలు కురిసే సమయంలో నీరు వృథా కాకుండా చెరువులు, చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. అలాగే గండిపాళెం, మర్రివూట్ల, నక్కలగండి రిజర్వాయర్లను ఆధునికీకరించాలన్నారు. ఉదయగిరి, వింజమూరు వైద్యశాలల స్థాయిని వంద పడకలకు పెంచడంతోపాటు ఉదయగిరిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఉదయగిరి, కొండాపురం, తెల్లపాడు, చినక్రాకలో మూతపడ్డ యునాని, ఆయుర్వేద వైద్యశాలలను తెరిపించాలన్నారు. నియోజకవర్గాన్ని సాంకేతికపరంగా అభివృద్ధి చేయడంతోపాటు గంగిరెడ్డిపల్లికి మంజూరైన మైనారిటీ కళాశాల పనులు ప్రారం భించేలా చూడాలన్నారు. చారిత్రాత్మక ప్రదేశమైన ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

అదనపు తరగతి గదులు మంజూరు చేయాలి

మండలంలోని వెంకట్రావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని ఆదివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డితో కలిసి ప్రధానోపాధ్యాయుడు చల్లా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. పాఠశాల ఇటీవల ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యిందని, తగినన్ని తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే పరిశీలించి అదనపు తరగతి గదుల మంజూరుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు

● పట్టించుకోని అధికారులు



ట్రాక్టర్లకు గ్రావెల్ నింపుతున్న ఎక్స్‌కవేటర్

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 13 (ఆంధ్రజ్యోతి): అసలే ఆదివారం సెలవు దినం.. ఆపై కనిపించని అధికారుల జాడ. ఇక అడిగేవారు లేరులే అన్న ధీమాతో కొంతమంది వ్యాపారులు యధేచ్ఛగా గ్రావెల్ తరలింపునకు పూనుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మండలంలోని జీ.కొత్తపల్లి గ్రామ శివారు ఇరిగేషన్ చెరువులో సారవంతమైన గ్రావెల్ ఉండడంతో వ్యాపారులు ఎక్స్‌కవేటర్ ద్వారా తవ్వకాలు సాగించి ట్రాక్టర్లతో సమీప జీ.కొండారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తున్నా అడ్డుకునేవారే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి నిబంధనలకు విరుద్ధంగా సాగిస్తున్న గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



అనంతసాగరం: కరపత్రాలు ఇస్తున్న మధుసుధన్‌రెడ్డి

అనంతసాగరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు టీడీపీ మండల సీనియర్ నాయకుడు పాతపాటి మధుసుధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని మంచాలపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏడాది పాలన తీరుపై స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు.

●**సంగం:** అధికారం చేపట్టిన తొలి ఏడాదే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఎన్నికల హామీలను అమలుపరిచిందని సంగం సాగునీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండలంలోని తలుపూరుపాడు గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీచేసి వారు లబ్ధి పొందిన పథకాల వివరాలతోపాటు సమస్యలను అడిగి తెలుసుకుని వైె టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహుజన సమాజ్ పార్టీ కమిటీ ఎన్నిక



నియోజకవర్గ లీగల్ అడ్వైజర్ జ్యోతి శ్రీనివాసులును అభినందిస్తున్న జిల్లా అధ్యక్షురాలు పుష్పాంజలి

ఆత్మకూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఎస్పీ జిల్లా అధ్యక్షురాలు కె పుష్పాంజలి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కమిటీని ఎంపిక చేశారు. ఆత్మకూరు నియోజకవర్గ లీగల్ అడ్వైజర్‌గా జ్యోతి శ్రీనివాసులు, ఆత్మకూరు మండల అధ్యక్షుడిగా కె హజరత్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టి కృష్ణ, పట్టణ అధ్యక్షుడు బుర్రా శేషాద్రి, బీఎస్పీ సభ్యులు పాల్గొన్నారు.


త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

ఆత్మకూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని నాగులపాడు, చెర్లోయడ వల్లి, అల్లీపురం, రావులకొల్లు గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమ ంలో ప్రబోధ సేవాసమితి పొదలకూరు కమిటీ అధ్యక్షుడు జి పెంచలనరసయ్య, సభ్యులు బి కృష్ణయ్య, పి మధు, పి గాయత్రి, ఈ పద్మమ్మ, శేషాద్రి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దుత్తలూరు (ఉదయగిరి), జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 31 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని భైరవరం గ్రామంలో ఆదివారం నాయకులు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గంగపట్ల సింహాద్రి, గొల్లపల్లి మోహన్‌రావు, వెంగయ్య, అవినాష్, పెంచలమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

దుత్తలూరు (ఉదయగిరి), జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆధార్‌కార్డు లేని, పోగొట్టుకున్న ఎస్టీ వర్గ ప్రజల సౌకర్యార్థం ఆధార్‌కార్డుల మంజూరుకు సోమవారం నుంచి శనివారం వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హనుమంతరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమ, మంగళవారాలు దుత్తలూరు-1, బుధ, గురువారాల్లో నర్రవాడ, శుక్ర, శనివారాల్లో నందిపాడు సచివాలయాల్లో ఈ ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున ఎస్టీ వర్గ ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.